2nd pages1.qxd 5/31/2025 8:00 PM Page 1

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

మంచిమాట

ఎంత ఆస్తి ఉన్నా తినేది ఆహారాన్నే..
మనకెంత గుర్తింపు ఉన్నా అందరూ
చూసేది మంచిగుణాన్నే..
ఏ కులంలో పుట్టినా అందరూ చూసేది
మంచితనాన్నే..
మనదెంత గొప్పమతమైనా అందరూ
చూసేది మానవత్వాన్నే..
ధనముంటే ధనవంతుడు అంటారు ..
అదే దానం చేస్తే భగవంతుడు అంటారు..!!

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 208 విశాఖపట్నం, 1 జూన్ 2025 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## పింఛన్ల పంపిణీలో మనమే టాప్

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో స్వయంగా పింఛన్ల పంపిణీ




సీఎం చంద్రబాబు

**కోనసీమ జిల్లా, విశాఖ సమాచారం:** పేదవాడికి సహాయం చేస్తే వచ్చే సంతోషం ఏ పనిలోనూ ఉండదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పింఛన్లు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటింటికి వెళ్లి అందిస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి అందించేలా చర్యలు చేపట్టామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరులో సీఎం పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు. "ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే పింఛను మొత్తాన్ని పెంచాం. పేదవాడి కోసం పింఛన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్. ప్రజల ఆదాయం పెంచి అన్ని విధాలుగా ఆదుకుంటాం. అధిక పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. మాది పేదల ప్రభుత్వం. మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నాం. ఉచితంగా మూడు వంటగ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నాం. పేదలకు మూడుపూటలా అన్నం పెట్టాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. ప్రభుత్వ యంత్రాంగం పేదల గురించే ...(మిగతా 2లో)

## నారీశక్తికి సవాల్ విసిరి ఉగ్రవాదులు మట్టిలో కలిశారు

- ప్రధాని మోదీ



**భోపాల్:** పహల్గాంలో దాడికి పాల్పడి.. భారత నారీశక్తికి సవాల్ విసిరి.. ఉగ్రవాదులు వారి వినాశనాన్ని వారే కొనితెచ్చుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రదాడికి ప్రతీకారంగా..'ఆపరేషన్ సిందూర్' లో పలువురు మహిళా అధికారిణులు పాల్గొని ఉగ్రవాదుల ఆచూకీ గల్లంతు చేశారని కీర్తించారు. రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా మధ్యప్రదేశ్ రాష్ట్ర భోపాల్‌లో శనివారం నిర్వహించిన 'మహిళా స్వశక్తికరణ్ మహా సమ్మేళన్'లో ప్రధాని మాట్లారు. ఉగ్రవాదులే కాదు.. వారిని పోషించేవారు కూడా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ ప్రపంచానికి చాటి చెప్పిందని ప్రధాని పేర్కొన్నారు. ఆ సమయంలో భారత కుమార్తెల బలాన్ని ప్రపంచం మొత్తం చూసిందన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాలపై పాక్ దాడులు చేసినప్పుడు అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారి నేతృత్వంలోని మహిళా బీఎస్‌ఎఫ్ బృందం మూడు రోజుల పాటు అఖ్నూర్‌లోని తమ ఫార్వర్డ్ పోస్టులపై పోరాడారని కీర్తించారు. "మన సంప్రదాయంలో 'సిందూర్'.. 'నారీశక్తి'కి చిహ్నం. పహల్గాంలో, ఉగ్రవాదులు కేవలం మన పౌరుల రక్తం మాత్రమే కళ్ల చూడలేదు. మన సంస్కృతిపై దాడి చేశారు. మన సమాజాన్ని విభజించడానికి ప్రయత్నించారు. ఉగ్రవాదులు భారత నారీశక్తికి విసిరిన సవాలే వారి పాలిట, వారిని పోషిస్తున్న వారి పాలిట శాపంగా మారింది. పాకిస్థాన్ సైన్యం కూడా ఊహించని ప్రాంతాల్లో ఉగ్రవాద శిబిరాలపై మన సాయుధ దళాలు దాడులు ...(మిగతా 2లో)

## అమరావతిలో క్వాంటం వ్యాలీ : టెక్నాలజీ పార్క్



**అమరావతి, విశాఖ సమాచారం:** అమరావతిలో క్వాంటం వ్యాలీ పార్క్ ఏర్పాటుపై ఏపీ ఐటీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. క్వాంటం వ్యాలీ టెక్నాలజీ పార్క్ ఎంవోయూను ర్యాటిఫై చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీని నిర్మాణానికి మూడు సంస్థలతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. టీసీఎస్, ఎల్‌అండ్‌టీ, ఐబీఎం సంస్థలు దీన్ని నిర్మించనున్నాయి. క్వాంటం పార్క్‌లో ఐబీఎం.. 156 క్యూబిట్ క్వాంటం సిస్టం-2ను ఏర్పాటు చేయనుంది. టీసీఎస్ క్వాంటం ...(మిగతా 2లో)

## నిర్వాసితులకు సకల సదుపాయాలతో లేఅవుట్

హోం మంత్రి వంగలపూడి అనిత



**నక్కపల్లి, విశాఖ సమాచారం:** నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ లో భాగంగా అన్ని సదుపాయాలతో లే అవుట్ ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తో కలసి ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు, నిర్వాసిత డి ఎల్ పురం, రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, వేంపాడు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ జిల్లా విశాలమైన సాగరతీరం, జాతీయ రహదారి కలిగి పారిశ్రామిక అభివృద్ధికి ఎంతో అనుకూలం గా ఉందన్నారు. జిల్లా లో బల్క్ డ్రగ్, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భూ సేకరణలో నిర్వాసితులైన ప్రజలకు బోధిగలం గ్రామం వద్ద 151 ఎకరాల విస్తీర్ణం లో అన్ని సదుపాయాలతో లేఅవుట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి అయిదు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి తొమ్మిది లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 693 కోట్ల రూపాయలతో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేస్తున్నామని, 209 కోట్లతో లేఅవుట్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. లేఔట్‌లో పాఠశాల, అంగన్వాడీ, కమ్యూనిటీ హాల్, ...(మిగతా 2లో)

## వాట్సప్ ద్వారా మెగా డీఎస్సీ హాల్ టికెట్లు



**అమరావతి, విశాఖ సమాచారం:** ఏపీలో మెగా డీఎస్సీ హాల్ టికెట్లు విడుదలయ్యాయి. ఇప్పటికే cse.ap.gov.inలో అందుబాటులో ఉండగా.. వాట్సప్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. 95523 00009కు మెసేజ్ చేసి హాల్‌టికెట్లు పొందవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ...(మిగతా 2లో)



**పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం ఉద్దండపురంలో శనివారం హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామస్థులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.**

- 2వ పేజీలో

## చెప్పుకోవడానికి ఏమీ లేకే వైసీపీపై విమర్శలు





మహానాడు ఒక ఫార్స్‌లా ముగిసింది

పదో తరగతి మూల్యాంకనంలో ప్రభుత్వం విఫలం

శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజం


**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** కడపలో టీడీపీ అట్టహాసంగా నిర్వహించిన మహానాడు ఒక ఫార్స్‌లా ముగిసిందని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చేసిన మోసాన్ని, ఏడాది పాలన తరువాత మరోసారి ఈ మహానాడు ద్వారా మోసం చేసేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. మహానాడు ద్వారా ఈ రాష్ట్ర ప్రజలకు అధికార పార్టీగా తెలుగుదేశం ఏ చెప్పిందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది అసమర్థ పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, సభ్యత మరిచి దారుణమైన భాషతో వ్యక్తిగత దూషణలు చేసేందుకే మహానాడును పరిమితం చేశారని ధ్వజమెత్తారు. చివరికి రాష్ట్రంలో పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల జవాబు పత్రాలను కూడా సరైన విధంగా మూల్యాంకనం చేయించలేని స్థాయికి విద్యాశాఖను తీసుకువెళ్ళిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ఈ చేతకాని ప్రభుత్వంలో విద్యార్థులకు సైతం దారుణమైన అన్యాయం జరగడం ...(మిగతా 2లో)



## పూర్తి స్థాయి డీజీపీగా హరీశ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

**అమరావతి, విశాఖ సమాచారం:** ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జ్ డీజీపీగా ఉన్న హరీశ్ కుమార్ గుప్తా పూర్తిస్థాయి డీజీపీగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ప్రభుత్వం ఈ నెల 27న అధికారిక ...(మిగతా 2లో)

## భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఎంతో దూరంలో లేదు: ట్రంప్



**వాషింగ్టన్:** భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరే సమయం ఆసన్నమైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. న్యూదిల్లీపై ట్రంప్ దాదాపు 26శాతం సుంకాలను విధించిన సంగతి తెలిసిందే. దీనిపై ఒక ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరుదేశాలు చర్చలు జరుపుతున్నాయి. ఈక్రమంలోనే ఎయిర్‌ఫోర్స్‌వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

భారత్‌తో టారిఫ్ చర్చలు గొప్పగా జరుగుతున్నాయని ట్రంప్ తెలిపారు. ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. అంతేకాకుండా భారత్-పాక్‌లు ఘర్షణలకు దిగితే వారితో వాణిజ్య ఒప్పందం చేసుకోవాలనే ఆసక్తి తనకు పోతుందని వ్యాఖ్యానించారు. ఈసందర్భంగా వాణిజ్య చర్చలు జరిపేందుకు పాకిస్థాన్ ప్రతినిధులు కూడా వచ్చేవారం ...(మిగతా 2లో)

## దేశంలో 3 వేలు దాటిన కోవిడ్ కేసులు



**ఢిల్లీ:** దేశంలో మళ్లీ కోవిడ్ కలకలం సృష్టిస్తోంది. క్రమంగా కేసుల సంఖ్య పెరుగుతోంది. 3,395కు యాక్టివ్ కేసులు చేరాయి. గత 24 గంటల్లో కోవిడ్‌తో నలుగురు మృతి చెందారు. యూపీ, ఢల్లీ, కర్ణాటక కేరళలో ఒక్కొక్కరు మృతి చెందారు. కోవిడ్ నుంచి కోలుకుని 1435 మంది ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయ్యారు. 8 రాష్ట్రాలలో కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. ఢల్లీలో 375, గుజరాత్‌లో 265, కర్ణాటకలో 254, కేరళలో 1336, మహారాష్ట్రలో 467, తమిళనాడులో 185, వెస్ట్ బెంగాల్‌లో 205, ఉత్తరప్రదేశ్‌లో 117 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. రద్దీ ప్రదేశాల్లో తిరిగేటప్పుడు మాస్కులు ధరించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో కరోనా కలకలం రేపింది. పాల్వంచ కేటీపీఎస్ కర్మాగారంలో విధులు నిర్వహించే వెంకట్ అనే వ్యక్తి కరోనా వచ్చినట్లు కేటీపీఎస్ హాస్పిటల్ వైద్యులు నిర్ధారించారు. కరోనా కొత్త వేరియంట్లపై భయాందోళనలు అవసరం లేదని.. ఇన్ఫెక్షన్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

2nd pages1.qxd 5/31/2025 8:00 PM Page 2



# యోగక్షేమాలు తెలుసుకుంటూ పింఛన్ల పంపిణీ



**నక్కపల్లి, విశాఖ సమాచారం:** పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తరువాత ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామస్థులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే ఆపరేషన్ చేయించుకున్న టీడీపీ కార్యకర్త ఆవాల నాగేశ్వరరావును పరామర్శించారు. అనంతరం గోవింద్ ఇంటికి వెళ్లిన మంత్రి అనిత.. స్వయంగా టీ కాచి, ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా, రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలు పెట్టిన భిక్షతోనే నేను ప్రజలకు సేవ చేస్తున్నానని అన్నారు. ఆదివారం సెలవు కావడంతో, ఫించన్‌లను ఒకరోజు ముందుగానే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పాయకరావుపేట పట్టణంలో అన్నా క్యాంటీన్‌కి శంకుస్థాపన చేశామని, త్వరలో నక్కపల్లి ప్రభుత్వ హాస్పటల్ వద్ద కూడా అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. తాగునీటి, సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.





గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు లక్ష ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టాల్లో ఉన్నా, ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. ఉద్దండపురం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సీసీ కెమెరాలు, స్టాఫ్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను హోం మంత్రి ఆదేశించారు.

## రేషన్ షాపుల ద్వారా పంపిణీతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట

### డిప్యూటీ సీఎం పవన్



**అమరావతి, విశాఖ సమాచారం:** జూన్ 1 నుంచి ప్రతీ పేద కుటుంబానికి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరకులు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఇకపై ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 8గంటల వరకు చౌక ధరల దుకాణాలు అందుబాటులో ఉంటాయన్నారు. "పేదలకు రేషన్ సరకులు అందించే చౌకధరల దుకాణాలను గత ప్రభుత్వం మూసివేసింది. ఇంటింటికీ అందిస్తామని రూ. 1600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేశారు. ఇంటింటికీ ఇవ్వడం మానేసి నెలలో ఒకటి రెండ్రోజులు మాత్రమే జంక్షన్లలో వాహనం నిలిపి ఇవ్వడంతో ఎంతో మంది పేదలు సరకులు అందక ఇబ్బందులు పడ్డారు. ఆ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారీ పనులు మానుకొని, చిరుద్యోగాలకు సెలవులు పెట్టుకోవాల్సి వచ్చేది. మిగిలిన రేషన్ బియ్యం, సరకులను అక్రమంగా తరలిస్తున్న విషయం సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపింది. వేలాది టన్నుల అక్రమ బియ్యాన్ని కాకినాడ, విశాఖ పోర్టుల్లో పట్టుకుంది. వీటిని అరికట్టేందుకు చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు నిత్యావసరాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరకులు అందించే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

## నేడు సత్తమ్మ మరిడిమాంబ పండుగ మహోత్సవం



**సింహాచలం, విశాఖ సమాచారం:** అప్పన్న సోదరి 14 గ్రామాల ప్రజల పొలిమేర దేవతగా విరాజిల్లుతున్న శ్రీ సత్తమ్మ తల్లి మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకట్రావు తెలిపారు. పండుగ మహోత్సవంలో భాగంగా అమ్మవారిని తెల్లవారుజామున సుప్రభాతం మేలుకొలుపు ఆరాధన, అనంతరం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించుకొని. మొక్కుబడులు తీర్చుకోవచ్చని కమిటీ సభ్యులు చెప్పారు. ఈ సందర్భంగా అమ్మవారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దరడముతో పాటు భారీగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులకు మంచినీరు మజ్జిగ ప్రసాదాలు అందజేస్తారు.. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు గంట్ల కనకరాజు. జాయింట్ సెక్రెటరీ బలిరెడ్డి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీలో ..

(మొదటి పేజీ తరువాయి)



ఆలోచించాలి. ప్రతి గ్రామానికీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక నేతలు వెళ్లాలి. పింఛను ఇచ్చే కార్యక్రమంలో భాగస్వాములైతే సమస్యలు తెలుస్తాయి. పేదల కోసం కష్టపడుతున్నాం. చేప ఇవ్వడమే కాదు.. పట్టిచ్చే విధానం నేర్పుతాం. భర్త చనిపోతే ఆటోమేటిక్‌గా భార్యకు పింఛను ఇచ్చే వెసులుబాటును తీసుకొచ్చాం. మూడునెలల వరకు పింఛను తీసుకునే వెసులుబాటు కల్పించాం. భర్త చనిపోతే భార్య అనాథగా మిగిలిపోకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాం. వెనుకబడిన వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది. బీసీల అభ్యున్నతి కోసం నిరంతరం పని చేస్తున్నాం. బీసీలకు సోలార్ ద్వారా ఉచితంగా ఇళ్లకు కరెంట్ ఇస్తాం. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేస్తాం. 98 వేల సబ్సిడీతో బీసీలకు, అగ్రవర్ణాలకు రూ. 75 వేల సబ్సిడీ ఇస్తాం. బడులు తెరిచే లోపల 'అమ్మకు వందనం' పథకం కింద రూ. 15వేల చొప్పున ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఇస్తాం. పాపులేషన్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా సంతానం పెంచుకోవాలి. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది.. యువత క్రమంగా తగ్గిపోతోంది. ప్రజల ఆదాయం పెరగాలని కోరుకుంటున్నా. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్ సిక్స్‌లో ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. ఎవరికీ ఏ సమస్య లేకుండా అవినీతి రహితంగా పాలన సాగిస్తున్నాం. మీ ప్రభుత్వాన్ని మీరే కాపాడుకోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

## ప్రజా భాగస్వామ్యంపై ప్రధాన దృష్టి

### యోగా డే ఏర్పాట్లపై జిల్లా అధికారులతో నోడల్ అధికారి మల్లికార్జున సమీక్ష



**విశాఖపట్టణం, విశాఖ సమాచారం:** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ప్రజలు భాగస్వామ్యమయ్యేలా పక్కా చర్యలు చేపట్టాలని, ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్, యోగా ఉత్సవాల మొబలైజేషన్, ట్రాన్స్ పోర్టు నోడల్ అధికారి డా. ఎ. మల్లికార్జున జిల్లా అధికారులకు సూచించారు. ఏర్పాట్లను పర్యవేక్షించే నిమిత్తం శనివారం జిల్లాకు విచ్చేసిన ఆయన కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జేసీ కె. మయూర్ అశోక్, ఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వీతేజ్ లతో కలిసి వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక ప్రమాణాలను పాటిస్తూ బీచ్ రోడ్డులో ఎంత మంది కూర్చోగలరు, అదనపు వేదికల్లో ఎంత మంది ఆశీనులు కాగలరు అనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. ప్రతి 24 చ.అడుగులకు ఒక్కరి చొప్పున యోగాసనాలు వేసేందుకు అనువుగా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే ప్రజలను తీసుకొచ్చే వాహనాల నిర్వహణలో పక్కాగా వ్యవహరించాలన్నారు. ట్రాఫిక్ పరమైన ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కంపార్ట్మెంట్ వారీగా బస్సులను కేటాయించాలని, ఆయా వాహనాలకు గుర్తించిన ప్రదేశాల్లో పార్కింగు వసతి కల్పించాలని సూచించారు. వాహనాల రాకపోకల విషయంలో గందరగోళం తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించి యోగా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని నోడల్ అధికారి సూచించారు. జిల్లాలో చేపట్టిన చర్యలను మ్యాపుల సాయంతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వివరించారు. జేసీ, ఈపీడీసీఎల్ సీఎండీతో పాటు భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెప్పుకోవడానికి ఏమీ లేకే వైసీపీపై విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత బాధాకరమని అన్నారు.

"కడపలో మహానాడు పేరుతో తెలుగుదేశం పార్టీ పెద్ద డ్రామా ప్రదర్శించింది. కొత్త టెక్నిక్‌లతో లేనివి ఉన్నట్లుగా చూపించారు. ఏడాది కాలంలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేక, జిమ్మిక్కులతో ప్రజలను మభ్య పెట్టేందుకు మూడు రోజుల పాటు చాలా తాపత్రయ పడ్డారు. ప్రతి రాజకీయ పార్టీకి ఆవిర్భావ దినం సందర్భంగా కార్యక్రమాలు చేసుకోవడం సహజం. అధికారంలో ఉన్న పార్టీ తాను చేసిన పనులను చెప్పుకుంటుంది. కానీ టీడీపీ మాత్రం అధికారంలో ఉండి, ఏడాది కాలంలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేక, వైసీపీని ఆడిపోసుకుని ఆత్మస్తుతి-పరనిందకే పరిమితమయ్యారు. స్థాయిలేని వ్యక్తులతో సభ్యత లేకుండా మాట్లాడిన భాషను మొత్తం రాష్ట్ర ప్రజానీకం అంతా చూశారు. మహానాడు సాక్షిగా ప్రజలకు హామీ ఇచ్చిన పథకాలను ఎప్పుడు, ఏ తేదీల్లో అమలు చేస్తామో ఎందుకు చెప్పలేక పోయారు? మా ప్రభుత్వంలో మేం ఏం చేశామో ఇప్పటికీ గట్టిగా చెప్పగలం. వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చుకున్నారు. గత ప్రభుత్వంలో ఎన్టీఆర్ జిల్లాగా విజయవాడ ప్రాంతంలో కొత్త జిల్లాను అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రకటించారు. మరి ఎన్టీఆర్ జిల్లాను కూడా ఎన్టీఆర్ విజయవాడ జిల్లాగా కూటమి ప్రభుత్వం మారుస్తుందా? ఈ రాష్ట్రానికి సేవలు అందించిన ముఖ్యమంత్రులకు ఇచ్చే గౌరవం ఇదేనా? ఇంత సంకుచితంగా సీఎం చంద్రబాబు ఎలా ఆలోచిస్తున్నారు" అని బొత్స ధ్వజమెత్తారు.

**పదోతరగతి మూల్యాంకనంపై సమీక్ష ఏదీ?**

"పదో తరగతి పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు రీ వెరిఫికేషన్ పెట్టుకుంటే వారికి ఏకంగా తొంబై మార్కులు వచ్చాయి. ఇటువంటి పరిస్థితిని ఎప్పుడైనా చూశామా? 16వేల మంది తమ పేపర్లను కరెక్షన్ చేయించుకుంటే దానిలో అధికశాతం అస్తవ్యస్తంగా పేపర్ల మూల్యాంకనం చేసినట్లుగా తేలింది. గతంలో ఏ నాడైనా అయిదు వేల కంటే ఎక్కువ మంది విద్యార్థులకి కరెక్షన్‌లో భిన్నంగా ఫలితాలు వచ్చాయా? మొదట ఇరవై మార్కులు వచ్చి, తరువాత రీవాల్యుయేషన్ తరువాత తొంబై మార్కులు వచ్చిన ఘటనలు ఎన్నడూ లేవు. దీనిని బట్టి చాలా దారుణంగా పదోతరగతి విద్యార్థుల జవాబుపత్రాలను దిద్దారనేది అర్థమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా పదోతరగతి పరీక్షల రీవాల్యుయేషన్‌పై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఇందులో ఎటువంటి తప్పులు చేశారో కనీసం సమీక్ష అయినా చేసుకున్నారా" అని నిలదీశారు.

మీడియా ప్రశ్నలకు బొత్స సమాధానం ఇస్తూ... "ఉర్సాకు ఎంతకు భూములు ఇచ్చారో బయటపెట్టాలి. కారుచౌకగా కట్టబెడుతున్నారన్న మా ఆరోపణలను వాస్తవం కాదని దమ్ముంటే నిరూపించాలి. ఏటా కనీసం పద్నాలుగు రోజులు జవాబు పత్రాలను దిద్దేవారు. కానీ తాజాగా మాత్రం తొమ్మిది రోజుల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేశారు. జవాబు పత్రాలను దిద్దేవారిపై పనిఒత్తిడిని పెంచారు. వాల్యుయేషన్ సెంటర్లు, టీచర్లను పెంచకుండా ఎక్కువ జవాబుపత్రాలను దిద్దాలని ఇవ్వడం వల్లే ఇటువంటి ఫలితాలు వెలువడ్డాయి. మహానాడులో రైతుభరోసా ఎప్పుడు ఇస్తారో ప్రభుత్వంలోని వ్యవసాయశాఖ మంత్రి ఎందుకు ప్రకటించలేదు? అమ్మ ఒడి, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగభృతి ఇలా కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారో తేదీలతో సహా ఎందుకు సంబంధిత మంత్రులు ఎందుకు వెల్లడిరచలేదు? ఏడాది కూటమి పాలనలో ప్రజలకు జరిగిన మోసాన్ని ఎత్తి చూపుతూ జూన్ 4వ తేదీన రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రజలను కలుపుకుని ఆరోజు నిరసనలు, ర్యాలీలు నిర్వహించి, అధికారులకు వినతిపత్రాలు సమర్పించనున్నాం" అని బొత్స తెలిపారు.

## నిర్వాసితులకు సకల సదుపాయాలతో లేఅవుట్

(మొదటి పేజీ తరువాయి)

ఆట స్థలం తదితర అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నిర్వాసిత గ్రామాలలో 289 మంది చదువుకున్న యువత ఉన్నట్లు గుర్తించడమైందని, వారికి ఒక్కొక్కరికి 30 వేల రూపాయలతో నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజలు అభివృద్ధికి సహకరించాలని, సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోరారు. నిర్వాసిత గ్రామాల సర్పంచులు, నాయకులు వారి గ్రామాలలో గల సమస్యలు తెలియజేయగా, అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. జిల్లా లో టాయ్స్ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నామని, దాని ద్వారా 25వేల మంది మహిళలకు ఉపాధి వస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ జిల్లాలో 80 వేల కోట్ల రూపాయలతో రెండు భారీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2010 సంవత్సరంలోనే భూసేకరణ చేశారని, నిర్వాసితులకు అందజేసే ప్యాకేజీ వివరాలు తెలియజేశారని, నిర్వాసితులకు అన్ని సదుపాయాలతో భోదిగెల్లం గ్రామం వద్ద కాలనీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ, పంచాయతీరాజ్, రెవిన్యూ అధికారులు,తహసీల్దార్ ఆర్. నరసింహమూర్తి పాల్గొన్నారు.

## వాట్సప్ ద్వారా మెగా డీఎస్సీ హాల్ టికెట్లు

(మొదటి పేజీ తరువాయి)

మెగా డీఎస్సీ అభ్యర్థులకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. "మెగా డీఎస్సీ నిర్వహణ పట్ల మా నిబద్ధత నెరవేరింది. డీఎస్సీలో అభ్యర్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలి" అని లోకేశ్ అన్నారు. జూన్ 6 నుంచి 30 వరకు మెగా డీఎస్సీ పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 16,347 టీచర్ పోస్టుల భర్తీ కోసం ఏప్రిల్ 20 నుంచి మే 15వరకు దరఖాస్తులు ఆహ్వానించగా.. అన్ని పోస్టులకు దాదాపు మూడున్నర లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.

## నారీశక్తికి సవాల్ విసిరి ఉగ్రవాదులు మట్టిలో కలిశారు

(మొదటి పేజీ తరువాయి)

చేశాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం చేపట్టిన ఈ ఆపరేషన్ భారత చరిత్రలోనే అతిపెద్ద విజయం" అని ప్రధాని వ్యాఖ్యానించారు. భోపాల్‌లో నిర్వహించిన 'మహిళా స్వశక్తికరణ్ మహా సమ్మేళన్'లో పాల్గొన్న ప్రధాని మోదీ ఇండోర్ మెట్రో, దాటియా, సత్నా విమానాశ్రయాల సూపర్ ప్రియారిటీ కారిడార్లను వర్చువల్‌గా ప్రారంభించారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రూ. 483 కోట్లతో నిర్మించిన కొత్త అటల్ గ్రామ సేవా సదన్ (పంచాయత్ భవన్)లకు ఇవ్వాల్సిన మొదటివిడత మొత్తాన్ని మోదీ బదిలీ చేశారు. 18వ శతాబ్దానికి చెందిన మాల్వాలోని హొల్కర్ రాజవంశానికి చెందిన రాణి అహల్యాబాయి అసాధారణ పాలన, సామాజిక సంక్షేమంపై నిబద్ధతను కొనియాడారు. రాణి అహల్యాబాయికి అంకితం చేసిన పోస్టల్ స్టాంప్, రూ. 300 స్మారక నాణాన్ని ప్రధాని విడుదల చేశారు.

## అమరావతిలో క్వాంటం వ్యాలీ : టెక్నాలజీ పార్క్

(మొదటి పేజీ తరువాయి)

కంప్యూటింగ్ సర్వీసెస్, సొల్యూషన్స్ సేవలు, క్వాంటంపై పరిశోధన, హైబ్రిడ్ కంప్యూటింగ్ స్ట్రాటజీస్ అందించనుంది. క్లైంట్ నెట్‌వర్క్, స్టార్టప్‌ల నిర్వహణకు ఇంజినీరింగ్ నైపుణ్యాలను ఎల్అండ్‌టీ అందించనుంది. 2026 జనవరి 1 నాటికి క్వాంటం వ్యాలీ టెక్నాలజీ పార్క్ సిద్ధం కానుంది.

## పూర్తి స్థాయి డీజీపీగా హరీశ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు. హరీశ్‌కుమార్ గుప్తా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. జమ్మూకశ్మీర్‌కు చెందిన ఆయన ఖమ్మం ఏఎస్పీగా తొలి పోస్టింగ్ పొందారు. మెదక్, పెద్దపల్లిలలో ఏఎస్పీగా సేవలందించారు. కృష్ణా, నల్గొండ జిల్లాల ఎస్పీగా, హైదరాబాద్ సౌత్‌జోన్ డీసీపీగా కీలక బాధ్యతలు నిర్వహించారు. గుంటూరు రేంజ్ ఐజీగా, శాంతిభద్రతల విభాగం, ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ విభాగం అదనపు డీజీపీగా పనిచేశారు. పోలీసు నియామక మండలి చైర్మన్‌గా, రైల్వే డీజీగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 2022 మే నుంచి హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా సేవలందించారు. జనవరి 31న అప్పటి డీజీపీ ద్వారకా తిరుమలరావు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తాను ప్రభుత్వం నియమించింది. శనివారం ఆయన పోలీసు ప్రధాన కార్యాలయంలో పూర్తి స్థాయి డీజీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీనియర్ పోలీసు అధికారులు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు అభినందనలు తెలిపారు.

## భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఎంతో దూరంలో లేదు: ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

వాషింగ్టన్‌కు రానున్నట్లు తెలిపారు. కాగా.. ఇప్పటికే ఇరుదేశాల మొదటి దశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు జరుగుతున్నాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్‌తో సమావేశమయ్యారు. ఈ ఏడాది సెప్టెంబరు-అక్టోబరు నాటికి తొలి దశ ఒప్పందాన్ని ఖరారు చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఈ చర్చల్లో ప్రధానంగా పరస్పర మార్కెట్ల వినియోగం.. స్థానిక నిబంధనల అమలు, టారిఫ్ మినహాయింపులకు పరిమితులపై ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఏప్రిల్‌లో ట్రంప్ పలు దేశాలపై టారిఫ్‌ల మోత మోగించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే 90 రోజుల పాటు ఈ సుంకాల అమలుకు అమెరికా విరామం ప్రకటించింది. ట్రంప్ విధించిన సుంకాలపై చాలా దేశాలు ప్రతీకార చర్యలకు దిగాయి. అయితే, భారత్ మాత్రం విభిన్నంగా ఆలోచించి.. ప్రతికార సుంకాలకు బదులుగా అగ్రరాజ్యంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై దృష్టిసారించింది. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి అడుగులు పడిన సంగతి తెలిసిందే. పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం చేసుకునేలా దేశాధినేతలు అంగీకారం తెలిపారు. ఈనేపథ్యంలోనే చర్చలు జరుగుతున్నాయి.

# భక్తుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం సరికాదు

**భక్తులను రెచ్చగొట్టి వీడియోలు చిత్రీకరించేవారిపై చట్టపరమైన చర్యలు - టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి**



**తిరుమల, (విశాఖ సమాచారమ్):-** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తుల కోసం టీటీడీ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నా భక్తుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం సరికాదని టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి అన్నారు.

వేసవి సెలవుల కారణంగా తిరుమలలో అధిక రద్దీ నెలకొనడంతో శిలాతోరణం దగ్గర మొదలవుతున్న దర్శన క్యూలైన్లను ఆయన శనివారం పరిశీలించారు.

భక్తులకు పంపిణీ చేస్తున్న అన్న, పానీయాలు గురించి వారితో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. భక్తులందరూ టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై అదనపు ఈవో వద్ద సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నిన్న ఓ వ్యక్తి దర్శన క్యూలైన్ లో అన్న ప్రసాదాలు అందలేదని నినాదాలు చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయనను వెంటనే సంప్రదించి ఆరా తీయగా తనకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో రద్దీ గురించి అవగాహన లేకపోవడంతో దర్శన సమయం ఆలస్యమవుతున్నదని తాను అసహనంతో నినాదాలు చేసినట్లు ఒప్పుకున్నారు.

అయితే క్యూలైన్ లో అన్న ప్రసాదాలు, పాలు అందిస్తున్నది గమనించి తన తప్పును గ్రహించి మానసిక క్షోభకు గురై, పశ్చాత్తాపంతో తన ప్రవర్తనను క్షమించమని కోరినట్లు కూడా ఆ భక్తుడి తెలియజేశాడని చెప్పారు.

టీటీడీ అధికారులు ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షిస్తూ భక్తులకు అందిస్తున్న సదుపాయాలను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. వేసవి సెలవుల నేపథ్యంలో ప్రతిరోజూ ఒక లక్షకు పైగా భక్తులు స్వామివారి దర్శనం కోసం వస్తున్నారని, వారాంతాల్లో ఈ సంఖ్య 1.20 లక్షలు దాటుతోందని చెప్పారు. వీఐపీ బ్రేక్, శ్రీవాణి దర్శనాలను తగ్గించి సాధారణ భక్తులకే దర్శనాల్లో పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రతిరోజూ 60శాతానికి పైగా సర్వ దర్శనానికి విచ్చేసే భక్తులే స్వామివారిని దర్శించుకుంటున్నారని చెప్పారు.

సాధారణ రోజులకంటే 10 వేల మందికి భక్తులకు అదనంగా దర్శనమయ్యేందుకు టీటీడీ సిబ్బంది రాత్రింబవళ్లు నిద్ర లేకుండా కష్టపడుతున్నారని తెలియజేశారు. క్యూలైన్లలోని భక్తులకు శ్రీవారి సేవకుల ద్వారా నిరంతరాయంగా అన్న ప్రసాదాలు, టీ, కాఫీ, పాలు, మజ్జిగ, స్నాక్స్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

టీటీడీ సిబ్బంది కృషిని పట్టించుకోకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినేలా కొందరు ఇలా ప్రవర్తించడం సరికాదని ఆయన తెలిపారు. కొందరు అనధికారిక వ్యక్తులు దర్శన క్యూలైన్లలో భక్తులను రెచ్చగొడుతూ వీడియోలు చిత్రీకరిస్తున్నారని, అలాంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**దక్షిణ మధ్య రైల్వే**

దక్షిణ మధ్య రైల్వే యొక్క టెండరు నోటీసులలోని వివరములు మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in నందు కూడా చూడవచ్చును.

**బహిరంగ ఈ-టెండరు నోటీస్** PUB/0639

భారత రాష్ట్రపతి తరపున కింద ఇవ్వబడిన టెండర్లను ఇవి 24.06.2025 15:00 గంటల వరకు ఆహ్వానించుచున్నాము.

వ.నెం.: 1, ఈ-టెండరు నెం. & తేది ఈడబ్ల్యూఎస్-డబ్ల్యూకెఎస్-టి-31-2025-26-01 తేది:29/05/2025 పని పేరు : ఎఫ్‌బిడబ్ల్యూపి/ఎంఎల్‌వై వద్ద రెండు సంవత్సరముల కాలపరిమితికి ఫేజ్డ్ ఎర్రె ఆల్ట్రా సోనిక్ వెల్డ్ టెస్టర్ ద్వారా ఫ్లాష్ బట్ వెల్డింగ్ జాయింట్లను యుఎస్ఎఫ్‌డి టెస్టింగ్ చేయుట. అంచనా టెండరు విలువ: (రూ): 3,34,53,000.00/- ధరావత్తు: (రూ): 3,17,300.00/- టెండరు డాక్యుమెంట్ వెల : (రూ): 0.00 పూర్తి చేయు కాలము (నెలలు): 24, నిర్వహణ కాలము (నెలలు): 01, మొత్తం టెండర్లు : ఒకటి మాత్రమే

1. టెండరుదారులు ఈ టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను. ఏ విధమైన మ్యాన్యువల్ ఆఫర్లు పరిగణించబడవు.

2. ఏ విధమైన కారణము లేకుండా టెండర్లను రద్దు చేసే అధికారం రైల్వేకు కలదు.

3. టెండరుదారులందరూ జీఎస్‌టీఐఎన్ నెంబర్లను పొంది దరఖాస్తును సమర్పించవలెను.

డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఇంజనీర్. వర్క్‌షాప్/ లాలాగూడ, సికింద్రాబాద్

**బహిరంగ టెండరు నోటీస్ నెం. బి-ఈ29-టిఆర్‌డి టిఎన్‌డిఆర్-10-2025-26, తేది. 30.05.2025** PUB/0645

టెండరుదారులు ఈ క్రింది పేర్కొనబడిన పనులను ఐఆర్ఈపీఎస్‌లో చేయుటకు టెండర్లు ఆహ్వానించుచున్నారు.

టెండరు నెం. బి-ఈ29-టిఆర్‌డి-టిఎన్‌డిఆర్-10-2025-26, పని పేరు : బిజెడ్ఎ డివిజన్ - జిఆర్‌డి-డివిడి సెక్షన్: డిఎస్‌సిడిసి సురక్షితంగా నడపడానికి లైను ఆకృతి మీద ఇన్సులేషన్ షీట్లను ఏర్పాటు చేయుట. అంచనా టెండరు విలువ: (రూ): 2,57,48,296.20/- బిడ్ సెక్యూరిటీ: (రూ): 2,78,800.00/- పూర్తి చేయు కాలము : 09 నెలలు, మూసివేయు తేది : 23.06.2025, మధ్యాహ్నం 15:00 లకు టెండరు డాక్యుమెంట్ వెల : లేదు

ఎస్ఆర్. డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, టిఆర్‌డి/విజయవాడ

A0795

టెండరు షరతులు/వివరాలు/ నిబంధనలు, మరియు టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.in లేదా http://www.scr.indianrailways.gov.in ను సందర్శించండి.

# దేశభక్తి గల పౌరులుగా యువతకు శిక్షణ

**608 మంది ఎన్ సి సి క్యాడెట్స్ కి 10 రోజులు 25 రకాల శిక్షణ, అవగాహన కార్యక్రమాలు**

**ఆటలు, పాటలు, నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలతో ముగింపు**



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** దేశభక్తి గల పౌరులుగా ఎన్ సి సి క్యాడెట్స్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. 13 వ ఆంధ్ర బెటాలియన్ యొక్క వార్షిక శిక్షణ శిబిరం (ఎటిసి-4) విశాఖ మహానగరంలో రుషికొండ లోని గాయిత్రి విద్యా పరిషత్ లో నిర్వహించారు. పది రోజులపాటు 608 మంది క్యాడెట్స్ కు 25 రకాల శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం శుక్రవారం ఆటలు, పాటలు, నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలతో ముగింపు ఉత్సవంతో కార్యక్రమాలు ముగిసాయి.

ఎన్ సి సి అంటే యువతను క్రమశిక్షణతో, దేశభక్తి గల పౌరులుగా తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉన్న సైన్యం, నౌకాదళం, వైమానిక విభాగాన్ని కలిగి ఉన్న మూడు రకాల సేవల సంస్థ. భారత సాయుధ దళాల యువజన విభాగం, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ గా పేర్కొంటారు.

గడిచిన పది రోజులు గా ఎల్ టి కల్నల్, కమాండింగ్ ఆఫీసర్ నీరజ్ కుమార్, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిం నేతృత్వంలో ఆయుధాలతో ఫైరింగ్ , శత్రువులను ఎదుర్కోవడం మేప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్ లొ సెక్షన్ పార్మేషన్స్, గార్డ్ ఆఫ్ హానర్ రిపబ్లిక్ డే క్యాంపు సెలక్షన్స్ పై శిక్షణ ఇచ్చారు

తల సైనిక్ క్యాంపు అవగాహన కల్పించారు. సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ ఎస్ బి) కి ఎన్ సి సి క్యాడెట్స్ ను సిద్ధం చేయడం కోసం ఎగ్జామ్స్ కి ఎలా ప్రిపేర్ అవ్వాలి అనే అంశం మీద అవగాహన కల్పించారు. అగ్ని వీర్ ఆర్మీ సెలక్షన్స్ మీద అవగాహన కల్పించారు. సీ హారియర్ మ్యూజియం కి వెళ్లి అక్కడ ఉన్న ఎయిర్ క్రాఫ్ట్ పార్ట్స్, జెట్ ఇంజన్లు, మిస్సయిల్స్ వాటి పని విధానం, ఏ సమయంలో వాటిని ఎలా వినిపిస్తారు అనే దాని మీద అవగాహన కల్పించారు. సబ్మెరైన్ లోపలికి తీసుకొని వెళ్ళి అది పని చేసే విధానం, అందులో వినియోగించే ఆయుధాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

సామాజిక అంశాల మీద, సమాజానికి సేవ చేయడం గురించి అవగాహన కల్పించేందుకు బ్లడ్ డొనేషన్ క్యాంపు లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ సంస్థ తో కలిసి నిర్వహించారు. పోలీసు అధికారులతో మహిళలకు రక్షణ కు శక్తి యాప్ ఎలా ఉపకరిస్తుంది, ఎలా ఉపయోగించాలి, డ్రగ్స్ వల్ల కలిగే నష్టం, యువత దానికి అడ్డు కట్ట వెయ్యడానికి చేపట్ట వలసిన అంశాల మీద శిక్షణ ఇవ్వడం జరిగింది. సివిల్ డిఫెన్స్ అంశాలు మీద శిక్షణ పొందారు. రోజూ ఉదయం రుషికొండ బీచ్ లో యోగాసనాలు వేసారు.

గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ తొ కలిసి ఒక్క సారి వాడి వదిలేసె ప్లాస్టిక్ వద్దే వద్దు అంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జివిఎంసి అధికారులతో కలిసి చెత్త నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, విపత్తులు సమయం లో ఎన్ సి సి క్యాడెట్స్ అందించవలసిన సేవలు, జలవనరుల నిర్వహణ, మన ఆరోగ్యం, మన పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అంశాలు గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ తో కలిసి తల్లికి వందనం పేరు తో మొక్కలు నాటారు. ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్ లో విత్తన బంతులు తయారు చేసారు.

తొమ్మిదవ రోజు తిరంగా యాత్ర నిర్వహించడం జరిగింది. చివరి రోజున క్యాడెట్స్ మానసిక వికాసానికి ఆటల పోటీలు నిర్వహించడం, పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ముగింపు ఉత్సవం నిర్వహించడం జరిగింది.

# ఎకోర్వో సమ్మర్ క్యాంప్ ముగిసింది




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ (ఎకోర్వో) తన సమ్మర్ కోచింగ్ క్యాంప్ 2025ను విజయవంతంగా ముగించింది. అనురాగ్ మాంటిస్సోరి స్కూల్‌లో 2025 ఏప్రిల్ 23 నుండి మే 30 వరకు జరిగిన ఈ క్యాంప్, పిల్లలు వివిధ రకాల సుసంపన్న కార్యకలాపాలలో పాల్గొనడానికి ఒక శక్తివంతమైన వేదికను అందించింది.

నెల రోజుల పాటు జరిగిన ఈ క్యాంప్‌లో, పాల్గొనేవారు కరాటే, యోగా, కాలిగ్రఫీ, డ్రాయింగ్, చెస్, ఆర్ట్, క్రాఫ్ట్, కీబోర్డ్, గాత్ర సంగీతం మరియు నృత్యాలలో సెషన్‌లను ఆస్వాదించారు. ఈ సంవత్సరం, సమ్మర్ క్యాంప్‌కు కొత్త కోణాన్ని జోడించి, మహిళల కోసం ప్రత్యేకంగా ఫాబ్రిక్ పెయింటింగ్ మరియు టైలరింగ్ తరగతులతో ఒక ప్రత్యేక చొరవను ప్రవేశపెట్టారు.

ఈ క్యాంప్‌ను ఎకోర్వో అధ్యక్షురాలు జ్యోత్స్న బోహ్రా మార్గదర్శకత్వంలో నిర్వహించారు. విశాఖపట్నంలోని రైల్ క్లబ్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో, అత్యుత్తమ ప్రదర్శనకారులకు మరియు పాల్గొన్న వారందరికీ శ్రీమతి జ్యోత్స్న బోహ్రా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మధుమిత సాహూ (వైస్ ప్రెసిడెంట్), శ్రీమతి అంకితా శర్మ (సెక్రటరీ), మరియు ఇతర కార్యనిర్వాహక సభ్యులు.

ఈ సంవత్సరం, ఈ శిబిరంలో రైల్వేయేతర కుటుంబాల నుండి వచ్చిన 100 మందికి పైగా పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అదనంగా, 20 మందికి పైగా మహిళలు ఫాబ్రిక్ డిజైనింగ్ తరగతుల నుండి ప్రయోజనం పొందారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్యోత్స్న బోహ్రా ఇటువంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను హైలైట్ చేశారు, ఈ శిబిరం నగర పిల్లలు రైల్వేల యొక్క విస్తారమైన వనరులను ఉపయోగించుకోవడానికి, వారి నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, జట్టు స్ఫూర్తిని పెంపొందించడానికి మరియు వారి వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి ఒక విలువైన అవకాశాన్ని అందించిందని పేర్కొన్నారు.

# టెన్త్ పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో ప్రభుత్వం విఫలం : వైఎస్ జగన్

**తాడేపల్లి, (విశాఖ సమాచారమ్):-** పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, విద్యా వ్యవస్థ ఇలా ఉంటే మిగతా వాటిని ఎంత ఘోరంగా నడుపుతున్నారోనని సీఎం చంద్రబాబుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ చురకలంటించారు. ఈ మేరకు నాలుగు పాయింట్లతో తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.



"చంద్రబాబు గారూ.. మీరు, మీ కొడుకు విద్యాశాఖ మంత్రి లోకేష్ టెన్త్ పరీక్షల నిర్వహణలో పూర్తిగా ఫెయిల్ అయ్యారు. మీ పాలనలో విద్యారంగం భ్రష్టుపట్టిపోయింది. మీ అవివేక, అనాలోచిత, పరిణితిలేని నిర్ణయాలతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కష్టాలే ఎదురవుతున్నాయి. పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనాన్ని కూడా సరిగ్గా నిర్వహించలేని దుస్థితిలో ఉన్న మీరు, మిగతా వ్యవస్థలను ఇంకా ఎంత ఘోరంగా నడుపుతున్నారో అర్థం అవుతోంది. సుమారు 6.14 లక్షల మంది రాత్రీపగలూ కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, జవాబు పత్రాలను సరిగ్గా దిద్ది, పారదర్శకంగా ఫలితాలు వెల్లడిరచాల్సిన మీరు, ఘోరంగా విఫలమై, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను క్షోభకు గురిచేశారు. ఇప్పుడు ప్రతి స్టూడెంట్‌కూడా తన మార్కుల జాబితాపై అనుమానాలు వ్యక్తంచేసే పరిస్థితిని తీసుకు వచ్చారు. మీరు చేసిన తప్పులు కారణంగా ట్రిపుల్ ఐటీ, గురుకుల జూనియర్ కాలేజీలు సహా ఇతరత్రా అడ్మిషన్లలో విద్యార్థులు అన్యాయమైపోయిన ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

చంద్రబాబుగారూదీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? అసలు పరీక్షల నిర్వహణ సమయంలోనే మీ బేలతనం బయటపడిరది. ప్రశ్నపత్రాలు లీకేజీ అయ్యాయి. అయినాసరే తప్పులను సరిదిద్దుకోకపోవడం మీ అసమర్థతకు నిదర్శనం కాదా? మన రాష్ట్రంలో చదివే ప్రతి విద్యార్థి ప్రపంచస్థాయిలో పోటీని ఎదుర్కొనేలా తీసుకొచ్చిన అనేక సంస్కరణలను వచ్చీరాగానే దెబ్బతీశారు. స్కూళ్లలో నాడు-నేడు, గోరుముద్ద, ఇంగ్లీషు మీడియం, సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకూ ప్రయాణం, 3వ తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు, 3వ తరగతి నుంచే సబ్జెక్టుల వారీగా బోధన ఇలా ప్రతి మంచి కార్యక్రమాన్ని కక్షగట్టి నీరుగార్చారు. పరీక్షలు నిర్వహణ, ఫలితాల వెల్లడిలోనూ విఫలమవుతున్నారు. తప్పులకు బాధ్యులైన విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో మొదలు అందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను" అని జగన్ పేర్కొన్నారు.

# యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం

## అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషా



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** ప్రతి రోజు యోగా చెయ్యడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని అందువల్ల ప్రతి ఒక్కరూ విధిగా రోజు యోగ సాధన చేసినట్లయితే మనుషులు రోగాలు బారిన పడకుండా ఆరోగ్యాంగా, సంపూర్ణంగా, ప్రశాంతంగా జీవిస్తారని అనకాపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి షేక్ అయిష్ అన్నారు.

యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా శనివారం అనకాపల్లి పట్టణం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ అయిషా ఆధ్వర్యంలో ఉదయం ఏడు గంటల నుండి 9 గంటల వరకు జిల్లా లో ఉన్న మాజీ సైనికుల తో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

యోగా గురువులు మంగియ్య, బి. అప్పారావు ల పర్యవేక్షణలో ఆర్డీఓ షేక్ ఆయుష, జిల్లా సైనిక సంక్షేమ అధికారి కృష్ణ రావు, మాజీ సైనికులు యోగాసనలు వెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కృష్ణ రావు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతు రావు, తహసీల్దార్ బి విజయ కుమార్ మాజీ సైనికులు తదితరులు పాల్గన్నారు.

# జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ శివప్రసాద్‌ను సన్మానించిన నగర మేయర్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరని ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితాన్ని ఆనందంగాను ,ఆరోగ్యంగా గడపాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ లో ఉద్యోగ విరమణ పొందిన జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాద రాజును పలువురు కార్పొరేటర్లతో కలిసి ఘనంగా మేయర్ సన్మానించారు.



ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఉద్యోగంలో చేరినప్పటి నుండి ఉద్యోగ విరమణ పొందినంతవరకు ప్రతి ఉద్యోగి అంచలంచెలుగా ఎదుగుతూ ఇంజనీర్లు గా, అధికారులుగా తను చేస్తున్న పనుల్లో భాగంగా ఎన్నో ఒడిదుడుకులకు ,ఒత్తిడిలకు లోనవుతారని వాటినన్నింటినీ అధిగమించి ప్రజాసంక్షేమము , అభివృద్ధికి కృషి చేస్తూ 62 ఏళ్ల పాటు ఉద్యోగం చేయడం ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన పి .శివప్రసాద్ రాజు జీవీఎంసీ నందు ప్రధాన ఇంజనీర్ గా జీవీఎంసీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అందుకు సహకరించిన వారి కుటుంబ సభ్యులకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి ఉన్నత అధికారిగా ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆనందదాయకంగానూ, ఆరోగ్యంగానూ ఉండాలని కోరుకున్నట్లు మేయర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో జివిఎంసి కార్పొరేటర్లు బల్లా శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, శరగడం రాజశేఖర్, గొలగాని వీరా రావు, బొండా జగన్నాథం, కొణతాల సుధా, గొలగాని పోలరావు. తదితరులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో ధ్వజస్తంభం ప్రతిష్టాపన



**రావికమతం, (విశాఖ సమాచారమ్):-** కొత్తకోటలో విశ్వబ్రాహ్మణుల సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ గోవిందమ్మ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో శనివారం ఉదయం 8:15 నిమిషాలు శుభముహూర్తానికి ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో,కొలహాల వాతావరణంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, డిసిసి బ్యాంక్ పూర్వ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్,మండల వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి శీలం శంకర్రావు తదితరులతో పాటు స్థానిక పెద్దలందరూ హాజరయ్యారు.

ఈ సందర్భంగా పురస్కరించుకొని వీరు మాట్లాడుతూ మన ప్రాంతంలో ఎక్కడ లేని విధంగా వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయాన్ని కొత్తకోట గ్రామంలో నిర్మించడం,అంతేకాక ఆలయ ప్రాంగణంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులను అభినందించారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని వీరి ఆకాంక్షను తెలియజేశారు. వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆశీస్సులతో మన ప్రాంతంలో వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలతో మన ప్రాంతం సుభిక్షంగా ఉండే విధంగా వారి ఆశీస్సులు అందించాలని స్వామివారిని వేడుకున్నారు.

# కెఎస్ఆర్ టీం ఆధ్వర్యంలో ఉచితం వైద్య శిబిరం



**నాతవరం, (విశాఖ సమాచారమ్):-** మండల కేంద్రంలోని నాతవరం గ్రామంలో పంచాయతీ వద్ద శ్రీ వేణు గోపాల మణి హాస్పిటల్, నర్సీపట్నం వారి సహకారంతో కె ఎస్ ఆర్ టీం%ఌ% గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంప్ లో 3 డాక్టర్స్, 8 నర్సింగ్ స్టాఫ్, 9 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొని సుమారు 120 మంది పేషెంట్స్ కి ఉచితంగా వివిధ రకాల పరీక్షలు చేసి 26 మంది కి వైరల్ జ్వరాలు ఉన్నట్టు గుర్తించి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది. ఒక్కొక్క పేషెంట్ కి సుమారు రూ.1500 విలువ గల మలేరియా, టైఫాయిడ్ %ఌ% డెంగ్యూ కి సంబంధించిన రక్త పరీక్షలు ఉచితంగా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాతవరం గ్రామ పెద్దలు,కె ఎస్ ఆర్ టీం ప్రతినిధి పారుపల్లి కిరణ్ కుమార్, గ్రామ యువకులు పాల్గొని సహాయ సహకారాలు అందించడం జరిగింది. అధిక సంఖ్యలో రోగులు వచ్చారు వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కే ఎస్ ఆర్ టీం కమిటీ వారు ఏర్పాట్లు చేశారు.

2nd pages1.qxd 5/31/2025 8:00 PM Page 4



విశాఖ సమాచారమ్
ఆదివారం 1-6-2025

# 'మంచు'కొస్తున్న ముప్పు

హిమాలయ పర్వతాలు భారతదేశానికి పెట్టని కోటలాంటివి. హిమాలయాల్లోని 800 కిలోమీటర్లకుపైగా పొడవైన హిందూకుష్ పర్వత శ్రేణిలో ఎన్నెన్నో హిమానీనదాలు(గ్లేసియర్స్) ఉన్నాయి. ఎన్నో నదులు, సరస్సులకు ఇవే ఆధారం. మధ్య, దక్షిణాసియాలో హిందూకుష్ గ్లేసియర్స్ నుంచి వచ్చే నీటిపై ఆధారపడి 200 కోట్ల మంది జీవనం సాగిస్తున్నారు. కర్బన ఉద్గారాలు, వాతావరణ మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతుండడంతో హిమానీనదాలు వేగంగా కరిగిపోతున్నాయి. పారిశ్రామిక యుగానికి ముందున్న ఉష్ణోగ్రతల కంటే మరో 2 డిగ్రీల సెల్సియస్‌కుపైగా పెరిగితే ఈ శతాబ్దం ఆఖరు నాటికి హిందూకుష్ హిమానీనదాల మంచులో 75 శాతం అంతమైపోతుందని తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. 200 కోట్ల మంది జీవనం ప్రమాదంలో పడుతుందని తేలింది. ఈ అధ్యయనం వివరాలను సైన్స్ జర్నల్‌లో ప్రచురించారు. భూగోళంపై మానవ మనుగడ కొనసాగాలంటే వాతావరణ మార్పుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణపై ప్రపంచ దేశాలన్నీ తక్షణమే దృష్టిపెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

10 దేశాలకు చెందిన 21 మంది శాస్త్రవేత్తలు ఉమ్మడిగా ఈ అధ్యయనం నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా 2 లక్షలకుపైగా గ్లేసియర్లలో మంచు కరుగుతున్న తీరును పరిశీలించడానికి 8 గ్లేసియర్ మోడల్స్ ఉపయోగించారు. ఉష్ణోగ్రతలు మరింత పెరగకుండా స్థిరంగా ఉన్నప్పటికీ గ్లేసియర్లలో మంచు కరగడం ఇప్పట్లో ఆగదని అధ్యయనకర్తలు స్పష్టంచేశారు. రాబోయే కొన్ని దశాబ్దాలపాటు ఈ పరిమాణం కొనసాగుతూనే ఉంటుందని పేర్కొన్నారు.

ఉష్ణోగ్రత కేవలం అర డిగ్రీ పెరిగినా సరే దాని ప్రభావం హిమానీనదాలపై కచ్చితంగా ఉంటుందని, ఈ మేరకు మంచు కరిగిపోతుందని సైంటిస్టు డాక్టర్ హ్యారీ జెకొల్లారీ చెప్పారు. మనం ఈ రోజు తీసుకొనే నిర్ణయాలు మన భవిష్యత్తు తరా ల బతుకులను నిర్ణయిస్తాయని అన్నారు. రాబోయే తరాలు బాగుండాలంటే గ్లేసియ ర్లను కాపాడుకోవాలని సూచించారు.

పారిస్ వాతావరణ ఒప్పందం ప్రకారం.. భూమిపై ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేస్తే హిమాలయాలు, కాకస్ పర్వతాల్లో 40-45 శాతం మంచును కాపాడుకోవచ్చు.

ఒకవేళ ఉష్ణోగ్రతలు 2.7 డిగ్రీలు పెరిగితే ప్రపంచవ్యాప్తంగా 75 శాతం మంచు కరిగిపోతుంది. ఈ శతాబ్దం ఆఖరు నాటికి కేవలం 25 శాతమే మిగిలి ఉంటుంది. యూరప్‌లో ఆల్ప్స్, ఉత్తర అమెరికాలో రాకీస్‌తోపాటు ఐస్‌ల్యాండ్‌లోని గ్లేసియర్లు మానవులకు జీవనాధారం కల్పిస్తున్నాయి. ప్రస్తుతం వీటికి ముప్పు పొంచి ఉంది. భూగోళం మరో రెండు డిగ్రీలు వేడెక్కితే.. ఇక్కడ మంచు 10 - 15 శాతమే మిగులుతుందని అంచనా వేస్తున్నారు. దాదాపు 90 శాతం మంచు కనుమరుగైతే పరిస్థితి తీవ్రత ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇక స్కాండినేవియా ప్రాంతంలో మంచు పూర్తిగా కరిగిపోతుందన్న అంచనాలున్నాయి. హిమానీనదాలపై ఐక్యరాజ్యసమితి తొలి సదస్సు ప్రస్తుతం తజకిస్తాన్‌లోని దుషాన్బేలో జరుగుతోంది. 50కిపై దేశాలు ఇందులో పాల్గొంటున్నాయి.

గ్లేసియర్లు వేగంగా కరిగిపోతుండడం వల్ల ఆసియాలో 200 కోట్ల మందికి కష్టాలు రాబోతున్నాయని ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు యింగ్‌మింగ్ యాంగ్ హెచ్చరించారు. ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో సమీప భవిష్యత్తులో తీవ్రమైన వరదలు, కరువులు సంభవించే ప్రమాదం ఉందని, సముద్ర నీటి మట్టం పెరగడం వల్ల తీర ప్రాంతాలు మునిగిపోతాయని చెప్పారు. మంచు కరిగిపోవడాన్ని ఆపాలంటే శిలాజ ఇంధనాలను పక్కనపెట్టాలని, క్లీన్ ఎనర్జీని ఉపయోగించుకోవాలని యింగ్‌మింగ్ యాంగ్ స్పష్టంచేశారు. భూమిని అగ్నిగుండంగా మారుస్తున్న కాలుష్య ఉద్గారాలకు కళ్లెం వేయడమే ఇందుకు పరిష్కారమని సూచించారు. ప్రపంచ దేశాలన్నీ దీనిపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

## పంచాంగం

ఆదివారం 1-6-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, వసంత రుతువు
వైశాఖ మాసం

| | |
|---|---|
| తిథి | : శు. షష్ఠి రా. 8.00 |
| నక్షత్రం | : ఆశ్లేష రా. 9.37 |
| వర్జ్యం | : రా. 10.10 ల 11.47 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# నిజాయితీకి నిలువుటద్ద నీలం

## నేడు నీలం సంజీవరెడ్డి వర్ధంతి సందర్భంగా..

సందర్భోచితం



శాసనసభ్యునిగా, రాజ్యసభ సభ్యులుగా, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా, లోక్‌సభ స్పీకర్‌గా అన్నిటికీ మించి దేశ ప్రథమ పౌరునిగా అనితరసాధ్యమైన రాజకీయ పయనం, మహోన్నత వ్యక్తి ఓ సామాన్య కుటుంబం నుండి వచ్చారంటే ఆశ్చర్యమ నిపిస్తుంది. రాజకీయాల్లో మేరునగ ధీరుడిగా పేరొందిన నీలం సంజీవరెడ్డి జీవితం 'అనంత' చరిత్రతో కలగలసిపోయింది. నిశితంగా పరిశీలిస్తే ఆయన వల్లే 'అనంత' కీర్తి దేశవ్యా ప్తమైంది. ఆ తరానికి చెందిన రాజకీయ నాయకులు కావడంతో విలువలకు ప్రాధాన్యతనిచ్చి పదవులను తృణప్రాయంగా వదిలేసి, ఆదర్శప్రాయుడు, నిజాయితీకి నిదర్శనంగా నిలిచారు. స్వాతంత్రోద్యమం నుంచి తనువు చాలించేదాకా భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిల్చిన నీలం సంజీవరెడ్డి జీవిత విశేషాలు ఆసక్తికరంగా ఉంటాయి.

కరువుకు పర్యాయపదంగా మారిన అనంతపురం జిల్లాలోని మారుమూల గ్రామం ఇల్లూరులో నీలం సంజీవరెడ్డి 1913 మే 19న జన్మించారు. 1931లో జాతీయోద్యమంలోకి ప్రవేశించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న నీలం భారత జాతీయ కాంగ్రెస్%జ% పార్టీతో సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని ప్రారంభించి , ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా, రెండుసార్లు లోక్‌సభ స్పీకం, కేంద్ర మంత్రిగా పనిచేశారు . 1977 నుండి 1982 వరకు పనిచేసిన నీలం సంజీవ రెడ్డి, ఏకగ్రీవంగా ఎన్నికైన ఆరవ రాష్ట్రపతి, అతి పిన్న వయస్కుడ్కైన భారత రాష్ట్రపతి. 1946లో మద్రాసు అసెంబ్లీ సభ్యుడుయ్యారు. 1947లోభారత రాజ్యాంగ సభ్యులుగా ఎన్నికయ్యారు. చాలామంది రాజ్యాంగ రచన అంటే అంబేద్కర్ ఒకరే అనుకుంటారు. రాజ్యాంగ నిర్మాణంలో నీలం సంజీవరెడ్డి కూడా కీలక పాత్ర వహించారు. మద్రాసు రాష్ట్ర ప్రభుత్వంలో 1949 నుండి 1952 వరకూ మద్యపాన నిషేధశాఖామంత్రిగా పనిచేశారు. 1952లో రాజ్యసభ సభ్యులయ్యారు. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు ప్రకాశం మంత్రి వర్గంలో, 1955లో బెజవాడ గోపాలరెడ్డి మంత్రి వర్గంలోనూ ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు.

1959లో భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షులయ్యారు. 1962లో తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. విలువలతో కూడిన రాజకీయాలకు ఆయన పెట్టింది పేరు. అందుకే బస్సుల జాతీయికరణ అంశం న్యాయస్థానం పరిశీలనకు తలొగ్గి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. లాల్‌బహుదూర్ శాస్త్రి మంత్రివర్గంలో ఉక్కుగనుల శాఖామంత్రిగా, ఇందిరాగాంధి మంత్రి వర్గంలో రవాణా, విమానయాన శాఖ మంత్రిగా పనిచేశారు. హిందూపురం నుండి లోక్‌సభ సభ్యుడ్కె 1967-69 మధ్య స్పీకర్‌గా పనిచేశారు. 1977లో నంద్యాల నుండి లోకసభకు ఎన్నికై , మార్చి నుండి జూల్కె వరకు మరోసారి లోకసభ స్పీకర్‌గా ఉన్నారు. అదే ఏడాది జూల్కె 25 నుండి 1982 జూన్ 24వరకు భారత రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు. పదవీవిరమణ అనంతరం చాలా కాలం జిల్లా కేంద్రంలోని నాగవిహార్‌లో ఉన్నారు. కొంతకాలం బెంగళూరులో నివశించారు. ఎటువంటి వివాదాంశాలకు తావివ్వని విధానాలతో జీవితాన్ని సాకారం చేసుకున్న ఆయన చివరకు 1996 జూన్ 1 న మరణించారు. ఆయన జీవించి ఉన్న రోజుల్లోనే శ్రీకంఠం సర్కిల్‌లో ఆయనకు శిలావిగ్రహం ఏర్పాటు చేశారు.

# తాటక వధ...యాగం పూర్తి



గంగానది దాటి విశ్వామిత్రుడు, రామలక్ష్మణులు అరణ్యంలో ప్రవేశించారు. ఆ అరణ్యం గురించి రామలక్ష్మణులకు ముని వివరించాడు.ఇది ఒకప్పుడు చక్కని ఉద్యానవనాలతో,భవనాలతో విలసిల్లింది. ఈ ప్రదేశానికి ఒక యక్షిణి వచ్చింది.ఆమె పేరు తాటక.సునందుని భార్య.ఆమె కుమారులు మారీచ సుబాహులు.ఈ ప్రాంతంలోని ప్రజలను వీరు ఆరగించడంతో నిర్జనమయిందని మహర్షి తెలిపారు. యక్షులకు అంతబలం ఉండదు. కాని తాటక వేయి ఏనుగుల బలం కలది. ఆమె తండ్రి తపస్సు చేసి బ్రహ్మను ప్రసన్నం చేసుకుని తాటక ని కుమార్తెగా పొందాడు. బ్రహ్మ అనుగ్రహంతో వేయి ఏనుగుల బలం లభించింది.,ఒకసారి సునందుడు, మారీచుడు మహర్షి అగస్త్యుని మీదపడ్డారు.దాంతో ఆయన ఆగ్రహానికి సునందుడు చనిపోగా, మారీచుని రాక్షసుడు కమ్మని శపించాడు.అప్పటి నుంచి తల్లీ కొడుకులు అగస్త్యుని ఏమీ చేయలేక ప్రజలను చంపి తింటున్నారు.మనకు ఈ దారిలోనే తాటక ఎదురు పడుతుందని విశ్వామిత్రుడు తెలిపారు. ఇంతలో తాటక రానే వచ్చింది. రామలక్ష్మణులను పట్టుకుని తినాలని ప్రయత్నించింది. కాని వారు తమ బాణాలతో ఆమెను అడ్డుకున్నారు.తాటక వీరిపై రాళ్ల వాన కురిపించింది.రాముడు బాణాలతో దూరంగా విసిరాడు. విశ్వామిత్రుడు తాటాక ను సంహరించమన్నాడు. 'సాధువులను,గోవులను హింసించే దాన్ని చంపడం వల్ల,ఆడదాన్ని చంపడం వల్ల పాపం వస్తుందని జంకకు' అన్నాడు. లోకకళ్యాణం కోసం చేసే పనివల్ల పాపం రాదు."ప్రజారక్షణ రాజధర్మం" అని విశ్వామిత్రుడు చెప్పారు.అంత రాముడు మహర్షీ.. తండ్రి గారి ఆదేశానుసారం మీరేం చెప్పినా చేయడం మావిధి' అని తాటక పై బాణం సంధించాడు. లక్ష్మణుడిని ఉద్దేశించి తమ్ముడూ దీని భయంకర రూపం చూసావా,ఆడది కనుక చంపకుండా కాళ్లు నరికి విడిచిపెడదామన్నాడు రాముడు.ఇంతలో తాటక రాముని మీదకి దూకబోయింది.విశ్వామిత్రుడు రామలక్ష్మణుల క్షేమం కోసం మంత్రాలు చదివారు.రాముడు దాని చేతులు ఖండించారు, లక్ష్మణుడు ముక్కు చెవులు కత్తిరించాడు.అయినా తాటక శిలా వర్షం ప్రారంభించగా రామా..చీకటి పడుతున్నది. రాత్రులందు రాక్షసులకు బలం పెరుగుతుంది, వెంటనే సంహరించు అని హెచ్చరించారు విశ్వామిత్రుడు. అంతే రాముడు శబ్దభేధి సంధించాడు.తాటక విలవిల లాడుతూ రామునిపై పడబోగా మరో బాణంతో రొమ్ము చీల్చాడు.చివరకు తాటక పర్వతం వలె క్రిందకు కూలి మరణించింది.అలా రాముడు దండకారణ్యంలో రాక్షస సంహారానికి తాటక వధతో శ్రీకారం చుట్టాడు.

ఆ రాత్రి అడవిలోనే విశ్రమించి ఉషః కాలంలో లేచి సంధ్యావందనాలు ముగించారు. అప్పుడు విశ్వామిత్రుడు రాముడిని ఉద్దేశించి ఎలాంటి వారినైనా సంహరించే తగిన అస్త్రాలు ఉపదేశిస్తానని దండచక్ర,ధర్మచక్ర,కాలచక్ర,విష్ణు చక్రాలతో ఐషిక, వజ్ర, వాయువ్య, ఆగ్నేయ, వరుణాస్త్రాలతో ఉపసంహరణ మంత్రాలు ఉపదేశించాడు. అనంతరం మళ్లీ ప్రయాణం ప్రారంభించారు. నడిచి నడిచి చివరకు విశ్వామిత్రుని ఆశ్రమం ప్రాంతానికి చేరారు. సిద్ధాశ్రమ వాసులైన మునులు వారికి స్వాగతం పలికారు.విశ్వామిత్రుడు తాను తలపెట్టిన యాగ దీక్ష తలపెట్టాడు. "ఆరు రోజులు క్రతువు జరుగుతుంది. ఆ సమయంలో నేను మౌనదీక్ష వహించాలి. యాగం పూర్తి అయ్యేలా యాగరక్షణ చేయాలని" విశ్వామిత్రుడు రామలక్ష్మణులను ఆదేశించాడు. యాగం నిర్విఘ్నంగా కొనసాగుతున్నది. చివరిదశలో తాటక కుమారులు మారీచ సుబాహులు ఆకాశములో భీకర ధ్వనులు సృష్టించి,కారు మేఘాల వంటి దేహాలతో రాక్షససేనతో రావడం చూసి రాముడు మానవాస్త్రం వేసాడు.ఆ బాణఘాతుకానికి మారీచుడు గిరగిరా తిరుగుతూ సాగర తీరాన పడ్డాడు. సుబాహుడు రాముని ఆగ్నేయాస్త్రానికి భస్మమయ్యాడు. రాక్షస సేన రాముడి వాయవ్యాస్త్రంతో దిగంతాలకు చేరారు. దాంతో రాక్షస పీడ విరగడ అయింది.విశ్వామిత్రుడు యాగం పూర్తి చేసి,సంతోషంతో రామలక్ష్మణుల శిరస్సును నిమిరి ఆశీర్వదించాడు.తాను తలచిన యాగం ఏలాంటి విఘ్నాలు లేకుండా రామలక్ష్మణుల సహాయంతో పూర్తికావడంతో విశ్వామిత్రుడు సంతృప్తి చెందాడు.అక్కడే విశ్రాంతి తీసుకున్న అనంతరం ఉదయాన నిద్ర లేచి విశ్వామిత్రుడు 'మిథిలాధీశుడు జనకుడు యాగం తలపెట్టాడు. ఆయన వద్ద శివ స్వరూపమైన శివధనస్సు ఉంది. దాన్ని ముల్లోకాలలో నూ ఎవరూ ఎత్తలేకపోయారు.ఎందరో క్షత్రియ వీరులు ఆ విల్లును సాధించాలని ప్రయత్నించి విఫలులు అయ్యారు. దానిని మీరు చూడాలి.నాతో పాటు మిథిలా కు రమ్మ'న్నాడు.గురువు మాటే శిరోధార్యం లాగా భావించి వారు అంగీకరించారు. తాను అటు నుంచి హిమాలయాలకు వెళతానని, ఆశ్రమం వాసులకు వీడ్కోలు పలికాడు. అనంతరం బాలురలతో ఉత్తర దిశగా ప్రయాణం ప్రారంభించాడు.చీకటి పడే సమయానికి రోణా నది తీరానికి చేరి స్నానం సంధ్యలు పూర్తి చేసుకుని విశ్రమించారు. నిద్ర వచ్చేవరకూ రామలక్ష్మణులకు విశ్వామిత్రుడు కథలు చెప్పాడు.

**యం.వి.రామారావు, 8074129668**

## సంచలన భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్
## (చిరస్మరణీయులు)



1884లో, ఈ ఫోటో కోసం నిల్చున్నారు నాటికి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వయస్సు అయిదేళ్ళు. ఇది ఆయన తొలి చిత్రపటం. చరిత్రలో గొప్ప మేధావులలో ఒకరుగా నిలిచిన శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్.

1879లో జర్మనీ లోని ఉల్మ్‌లో ఒక యూదు కుటుంబంలో జన్మించిన ఐన్‌స్టీన్ జీవితంలో తొలి సంవత్సరాలు సహజ ప్రపంచం పట్ల ఉత్సు కతతో గుర్తించబడ్డాయి. అయినప్పటికీ, ఆయన మాట్లాడటంలో చాలా నెమ్మదిగా ఉండేవారు. కొంతమంది ఆయన చెప్పాలనుకున్నది సరిగ్గా చెప్పేవాడు కాదని అనుకునేవారు.

ఈ ఫోటో తీసిన సమయంలో, ఒక సంచలనాత్మక భౌతిక శాస్త్రవేత్తగా అతని భవిష్యత్తు ఊహించలేనిదే.

ఈ ఫోటో తీసిన 1880లలో కొనసాగుతున్న పారిశ్రామిక విప్లవం ద్వారా నడిచే వేగవంతమైన శాస్త్రీయ, సాంకేతిక పురోగతి కాలం. యువకుడైన ఐన్‌స్టీన్ ఇంకా తన అసాధారణ సామర్థ్యం యొక్క సంకేతాలను చూపించనప్పటికీ, అతని చుట్టూ ఉన్న ప్రపంచం గణనీయమైన మార్పుకు లోనవుతున్న దశ అది. ఆ కాలంలోని మేధో వాతావరణం చివరికి అతని ఆలోచనను ప్రభావితం చేసింది. కానీ అతని ప్రతిభ పూర్తిగా వికసించడానికి చాలా సంవత్సరాలు పట్టింది. ఆయన తన చివరి సంవత్సరాల్లోనే సాపేక్ష సిద్ధాంతంతో స్థలం, సమయం, గురుత్వాకర్షణ యొక్క అవగాహనను తిరిగి రూపొందించారు.

ఐన్‌స్టీన్ పరిణతి చెందుతున్న కొద్దీ, ఆయన తొలి అంచనాలను అధిగమించి మేధో సాధన, ఆవిష్కరణలకు చిహ్నంగా మారారు. సైద్ధాంతిక భౌతిక శాస్త్రంలో ఆయన అద్భుతమైన కృషి వల్ల 1921లో నోబెల్ బహుమతిని సంపాదించిపెట్టింది, చరిత్రలో ఆయన స్థానాన్ని సుస్థిరం చేసింది. ఆయన బాల్యంలోని ఈ ఛాయాచిత్రం అత్యంత అద్భుతమైన వ్యక్తులు కూడా తరచుగా జీవితాన్ని అసాధారణమైన మార్గాల్లో ప్రారంభిస్తారని గుర్తు చేసింది. ఈ చిత్రం ద్వారా, శాస్త్రానికి చేసిన కృషి విశ్వం గురించి మన అవగాహనను శాశ్వతంగా మార్చే వ్యక్తి యొక్క నిర్మాణ సంవత్సరాలను మనం సంగ్రహంగా చూస్తాము.

**- యామిజాల జగదీశ్**

# సిందూర్ దిద్దింది వీళ్లే..



'ఆపరేషన్ సిందూర్'.. భారతీయులందరి హృదయం సగర్వంతో ఉప్పొంగేలా చేసిన దాడి. కశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక టూరిస్టులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులు, వారి తండాలను తుదముట్టించడానికి మన సైన్యం ఈ ఆపరేషన్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇది భారత పతాకాన్ని ఎంతగా రెపరెపలాడించిందో.. 'ఆపరేషన్ సిందూర్ లోగో' సైతం అంతగా ఆకట్టుకుంది. కొద్దిరోజులపాటు యువత ఫోన్ స్క్రీన్, కంప్యూటర్ వాల్‌పేపర్లుగానూ నిలిచిపోయింది.

అంతగా భారతీయుల మనసులను హత్తుకున్న ఆ లోగోను రూపొందించింది ఎవరో తెలుసా? ఏ తలలు పండిన మార్కెటింగ్ నిపుణులో, చేయి తిరిగిన డిజైనర్లో కాదు. ఇద్దరు సైనికాధికారులు. వాళ్లే లెఫ్టినెంట్ కల్నల్ హర్ష్ గుప్తా, హవల్దార్ సురీందర్‌సింగ్‌లు.

పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను తుత్తునియలు చేసిన వెంటనే.. భారత ఆర్మీ సామాజిక మాధ్యమ ఖాతాలో ఈ లోగో ప్రత్యక్షమైంది. రోజుల వ్యవధిలోనే, కోట్ల మంది ఈ లోగోను షేర్ చేసుకున్నారు. దీని రూపకల్పన వెనక ఈ ఇద్దరు ఎంతో కసరత్తు చేశారు. పహల్గాంలో యాత్రికుల్లోని మగవాళ్లనే లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. 26 మందిని హతమార్చారు. వాళ్లంతా హిందువులే. హిందూ సంప్రదాయం ప్రకారం.. భర్త చనిపోయిన స్త్రీ పాపిట సిందూరం పెట్టుకోకూడదు. ఆ ఆచారాన్ని దూరం చేసిన ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకునేలా ఈ పేరు సూచించారు. ఆపరేషన్ సిందూర్ ఆంగ్ల అక్షరాలు పూర్తిగా నలుపు రంగులో ఉంటాయి. సిందూర్‌లోని 'ఓ' అనే ఆంగ్ల అక్షరం స్థానంలో కుంకుమ భరిణె ఉంచారు. సెంటిమెంట్, నిగూఢమైన అర్థం ధ్వనిస్తున్న ఈ లోగో ప్రధాని మోదీకి సైతం నచ్చింది. ఆయన హర్ష్, సురీందర్‌లను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ విషయమంతా భారత సైన్యానికి చెందిన పత్రిక 'బాత్‌చీత్'లో ప్రస్తావించారు.

## చరిత్రలో ఈ రోజు (జూన్ 1)

**సంఘటనలు:**

1874: ఈస్టిండియా కంపెనీ రద్దు అమలులోకి వచ్చింది.

1930: భారత్‌లో మొదటి డీలక్స్ రైలు (దక్కన్ క్వీన్) బొంబాయి - పూణే ల మధ్య ప్రారంభం.

1955: అస్పృశ్యతను నేరంగా పరిగణించే చట్టం అమలులోకి వచ్చింది.

1964: నయాపైసా, పైసాగా మార్చబడిరది.

1978: ప్రపంచ కప్ ఫుట్‌బాల్ పోటీలు అర్జెంటీనాలో ప్రారంభమయ్యాయి.

1979: విశాఖపట్నం జిల్లాలోని కొంత భాగం, శ్రీకాకుళం జిల్లా నుంచి మరి కొంతభాగం కలిపి విజయనగరం జిల్లా అవతరించింది.

1981: జనరల్ కె.వి. కృష్ణారావు భారతదేశ సైనిక ప్రధానాధికారిగా నియామకం.

1996: భారత ప్రధానమంత్రిగా దేవెగౌడ నియామకం.

2001: నేపాల్ రాజప్రాసాదంలో రాజకుటుంబం హత్య

జననాలు:

1891: శీరిపి ఆంజనేయులు, కవి, పత్రికా సంపాదకుడు.

1926: మార్లిన్ మన్రో, హాలీవుడ్ నటి. ఖాళీ నిద్రమాత్రల సీసాతో, ఆమె పడకగదిలో శవమై పడి ఉంది.

1940: ఎస్.ఎ.కె.దుర్గ, సంగీత విద్వాంసురాలు.

1944: జరుగుల వెంకట రామ భూపాలరావు, వృక్ష శాస్త్రవేత్త.

1946: బాబు (చిత్రకారుడు), కొలను వెంకట దుర్గాప్రసాద్, తెలుగులో మంచి వ్యంగ్య చిత్రకారులలో ఒకరు. 'బాబు' ఆయన కలం (కుంచె) పేరు

1950 : కలిదిండి బి.ఆర్. వర్మ, భారతీయ భౌతికశాస్త్రవేత్త.

1958: గుమ్మా సాంబశివరావు, ఆధునిక తెలుగు కవి.

1959: కొల్లా అశోక్ కుమార్ , తెలుగు చలన చిత్ర ప్రతినాయకుడు, నిర్మాత

1964: ఎస్. వి. కృష్ణారెడ్డి, తెలుగు చలనచిత్ర పరిశ్రమలో దర్శకత్వంతో బాటు కథారచన, సంగీత దర్శకత్వం, విభిన్న కళలలో ప్రవేశం ఉన్న వ్యక్తి.

1970: మాధవన్ , నటుడు, రచయిత,దర్శకుడు .

1974: ఆకెళ్ళ రాఘవేంద్ర, రచయిత, పాత్రికేయుడు, ఐఏయస్ శిక్షకుడు.

1975: కరణం మల్లేశ్వరి, ఆంధ్రప్రదేశ్ కు చెందిన వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి.

1977: సలోని: తెలుగు, పలు భాషల సినీనటి.

1985: నిఖిల్ సిద్ధార్థ్, చలన చిత్ర నటుడు.

**మరణాలు:**

1868: జేమ్స్ బుకానన్, అమెరికా మాజీ అధ్యక్షుడు.

1961: మెల్విన్ జోన్స్, లయన్స్ క్లబ్ వ్యవస్థ స్థాపకుడు

1968: హెలెన్ కెల్లర్,అంధులకు, బధిరులకు, మూగవారికి వారధిగా, వికలాంగుల ఉద్యమాల సారథి

# పీఎం సూర్య ఘర్ సోలార్ రూఫ్ టాప్ ప్రజలు వినియోగించుకోవాలి



అనంతగిరి, (విశాఖ సమాచారమ్):- కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో సౌర విద్యుత్ వినియోగన్నీ ప్రోత్సహించేందుకుగాను పీఎం సూర్య ఘర్ సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని ప్రారంభించిందని అనంతగిరి మండల్ డెవలప్మెంట్ శాఖ అధికారి ఏ.వి.వి కుమార్ శనివారం నాడు విలేకరులకు తెలిపారు.ఈ పథకం ముఖ్య ఉద్దేశం ఏమనగా లబ్ధిదారులకు తక్కువ వడ్డీకే రాయితీతో కూడిన బ్యాంకు రుణాలను అందిస్తుందని లబ్ధిదారుల యొక్క ఇంటి పైకప్పు పై 10 చదరపు మీటర్ల అలాగే 100 చదరపు అడుగులు ఉన్న ఖాళీ స్థలంలో సోలార్ ప్లేట్లను అమర్చుకోనవలెను.దీనికి అయ్యే వ్యాయాన్ని ప్రభుత్వం వారే బ్యాంకు నుండి రాయితీతో కూడిన రుణాన్ని కూడా మంజూరు చేస్తారని ఆయన అన్నారు.ఈ యొక్క పథకాన్ని ఆసక్తి కలిగిన వారు www.pmsuryaghar.gov.in లేదా ఏపీఈపీడీసీఎల్ వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవచ్చు ఏదైనా సందేహం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1912 కి ఫోన్ చేసి పూర్తి సమాచారం తెలుసుకోవాలని ఆయన అన్నారు.

# పింఛన్లను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి/కశింకోట, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- పేదల సేవలో భాగంగా జిల్లాలో పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను సక్రమంగా, సకాలంలో పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే మే 31వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 7 గంటలకు నుండే జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అనకాపల్లి నియోజకవర్గం కశింకోట మండలం కశింకోట 13 వ వార్డు గవరపేట మధ్య వీధి లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని నేరుగా లబ్దిదారుల ఇంటి వద్దకు వెళ్లి పెన్షను డబ్బులు అందజేసారు.ఈ సంధర్భంగా జిల్లా కలెక్టరు లబ్దిదారులతో మాట్లాడుతూ ప్రతినెల ప్రభుత్వం అందిస్తున్న పెన్షను డబ్బులు పూర్తిగా అందుతున్నాయా, పెన్షను అందజేస్తున్నపుడు సచివాలయం సిబ్బంది డబ్బులు అడుగుతున్నారా వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్లు అందుకున్నప్పుడు డబ్బులు సరిచూసుకోవాలని తెలిపారు. లబ్దిదారులు పెన్షన్లు పంపిణీ ప్రక్రియపై సంతృప్తి, సంతోషం వ్యక్తంచేసారు. అనంతరం జిల్లా కలెక్టరు అధికారులతో మాట్లాడుతూ పెన్షన్లు పంపిణీ తొలి రోజే శతశాతం పూర్తిచేయుటకు కృషిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఎ. ప్రోజెక్టు అదికారి కె.శచీదేవి. మండల ప్రత్యేక అధికారి వి ఎల్ సుభాషిణి, ఎంపీడీఓ రవికుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, ఇతర వార్డు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తర నియోజకవర్గంలో పెన్షన్ పంపిణీ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- పేదల కు అండగా కూటమి ఉంటుంది. జూన్ నెల నుంచి ఏకంగా 70 వేల మందికి పైగా కొత్తగా పెన్షన్ల పంపిణీకి చేసాం. ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఇప్పటికే ఇస్తున్న వృద్ధులు, వితంతవులు, దివ్యాంగులతో పాటు స్పౌజ్ పేరుతో కొత్త కేటగిరీని ఏర్పాటు చేసాం. ఇప్పటికే పెన్షన్ తీసుకుంటున్న భర్త చనిపోతే ఆ పెన్షన్ భార్యకు ఇచ్చేలా ఈ కొత్త కేటగిరీని ఏర్పాటు చేయడం జరిగింది. స్పౌజ్ కేటగిరీ కింద కొత్తగా 89,788 మందికి పింఛన్లు ఇస్తున్నాం. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై నెలకు రూ.35.91 కోట్ల అదనపు భారం పడుతుంది.

రాష్ట్రంలో ప్రస్తుతం ఆసరా పెన్షన్లు తీసుకుంటున్న లబ్దిదారులు చనిపోతే వారి కుటుంబ సభ్యులకు వాటిని కొనసాగించే అవకాశం ఉండేది కాదు.

దీంతో చనిపోయిన వారి పెన్షన్లను ప్రభుత్వం రద్దు చేసేది. కానీ ఇప్పుడు కుటుంబ సభ్యుల్లో భర్త పెన్షన్ తీసుకుంటూ చనిపోతే దాన్ని ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో భార్యకు వర్తింపచేసేలా స్పౌజ్ పెన్షన్ కేటగిరీనీ ఏర్పాటు చేసాం.

కూటమి అధికారం లోకి వచ్చాక పెన్షన్ పెంపు విషయం లో పెను మార్పులు తీసుకొని వచ్చాము.

జగన్ రెడ్డి ఏడాది కి 250 చొప్పున పెంచితే మేము అధికారం రాగానే 4000, ఇస్తున్నాం చంద్రబాబు గారు వృద్దులకు పెద్ద కొడుకు లాగ అండగా ఉన్నారు.ఈ కార్యక్రమం లో 50 వార్డ్ అధ్యక్షులు సనపల వర ప్రసాద్ గారు,జనసేన వార్డ్ అధ్యక్షులు సంకు వెంకటేశ్వర్ రావు గారు,పలువురు అధికారులు,కూటమి నేతలు పాల్గొన్నారు.

# విశిష్ట సేవలందించిన అధికారులకు ఘన సన్మానం

## జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సభ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- అనకాపల్లి జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన నలుగురు పోలీసు అధికారులకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను సత్కరించారు.ఈ సందర్భంగా ఏ.ఆర్.ఎస్సై ఎం.సుబ్బారావు, నాతవరం ఏఎస్సై డి.శేఖర్, సి.ఎం.ఎస్ ఏఎస్సై పి.సత్యనారాయణ, ఏ.ఆర్.ఎస్సై బి.ఆదినారాయణ లకు ఎస్పీ శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన అధికారులు తమ విస్తృత అనుభవం, నిబద్ధతతో పోలీసు శాఖకు విశేషంగా సేవలందించారని ఎస్పీ తుహిన్ సిన్హా ప్రశంసించారు.పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నది.అయినా సమాజ రక్షణ కోసం మీరు చూపిన ఆత్మీయత, సేవా భావం ప్రశంసనీయమని" అన్నారు.వారు సుమారు 35 సంవత్సరాల సుదీర్ఘకాలం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలలో వివిధ హోదాల్లో అహర్నిశలు సేవలందించారని పేర్కొన్నారు.పదవీ విరమణ అనంతరం మీరు కుటుంబసమేతంగా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలి అని ఎస్పీ ఆకాంక్షించారు.ఏదైనా సహాయం అవసరమైతే, జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది అని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఏ.ఓ. ఏ.రామ్ కుమార్, ఇన్స్పెక్టర్లు ఎస్.బాల సూర్యరావు, టి.లక్ష్మి, బి.రామకృష్ణ, ఎస్ఐలు ఎస్.ప్రసాద్, బి.రమణయ్య, ఎస్.శేషగిరి రావు, సీనియర్ అసిస్టెంట్ జి.బీమాభాయ్ తదితర అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ నెల 21 నుండి నెల రోజుల పాటు నిర్వహించే యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తూ ఈ నెల 21 నుండి జరుగుచున్న యోగాంధ్ర-2025 కార్యక్రమాల ప్రగతిని సమీక్షిస్తున్నారు.సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆకాంక్షకు అనుగుణంగా ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్ర సాకారానికై ఈ నెల 21న ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని మంచి స్ఫూర్తితో ముందుకు తీసుకు వెళ్లేందుకు అధికారులు, ఉద్యోగులు అంతా సమిష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. విశాఖపట్నం వేదికగా జూన్ 21 న జరుగనున్న 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటున్న సందర్భంగా ప్రపంచానికి యోగ విశిష్టతను తెలియపర్చే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఆర్.కె.బీచ్ నుండి భీమిలి వరకు నిర్వహించే కార్యక్రమానికి జనసమీకరణ, రవాణా, పార్కింగు, మెడికల్ క్యాంపులు తదితర ఏర్పాట్లు సంబందిత శాఖలు సమన్వయంతో పూర్తిచేయాలని తెలిపారు. పార్కింగు స్థలంలో కరెంటు సదుపాయం ఏర్పాటుచేయాలన్నారు.సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ జిల్లాలో ఏర్పాట్లను వివరిస్తూ జిల్లానుండి పదివేల మంది పరిశ్రమల కార్మికులను ఈకార్యక్రమానికి పంపిస్తున్నట్లు తెలిపారు. వారికి ముందుగా యోగా శిక్షణ అందించడం జరుగుతుందనన్నారు. జిల్లా నుండి మూడు జాతీయ రహదారులు ఉన్నాయని, ఆయా మార్గాలలో నిర్దేశించిన ప్రదేశాలకు వారిని తరలించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించుటకు విశాఖపట్నం జిల్లా కలెక్టరు వారితో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# జిల్లాలో కేంద్ర బృందం సుడిగాలి పర్యటన

## ప్రభుత్వ పథకాలు, గ్రామ తీర్మానాలపై ఆరా



జి.మాడుగుల/పాడేరు, (విశాఖ సమాచారమ్):- భారత ప్రభుత్వ పంచాయతి రాజ్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ముక్తా శేఖర్ అధ్యక్షతన గల ఏడుగురు సభ్యుల కేంద్ర బృందం శనివారం జిల్లాలోని పాడేరు, అరకులోయ మండలా లలో పర్యటించి ప్రభుత్వ పథకాల అమలు తీరు, గ్రామ సభల నిర్వహణ, గ్రామ తీర్మా నాలు, గ్రామాలలో అందుతున్న మౌలిక సదుపాయాల గూర్చి ఆరా తీసి సంతృప్తి వ్యక్త పరిచారు. ముందుగా పాడేరు మండలం మినుములూరు సందర్శించిన బృందం అక్కడ కాఫీ, మిరియాల రైతులతో మమేకమై వారి జీవన విధానం, కాఫీ మిరియాల పంటలతో కలుగు లాభనష్టాలు, మద్దతు ధరల గూర్చి ఆరా తీసారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రటరీ ముక్తా శేఖర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అవసరమైన అంశాలను గ్రామ తీర్మానాల ద్వారా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అనంతరం మినుములురులో ఏర్పాటు చేసిన స్త్రీ శిశు శంక్షేమ శాఖ శిభిరంలో బాలింతలకు సీమంతం, చిన్నారులకు అన్న ప్రాసన చేసారు. అదేవిధంగా గ్రామంలో పించన్లు పంపిణీ చేస్తూ నగదు రూపంలో పంపిణీ చేయడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. జేసి డా. ఎంజే అభిషేక్ గౌడ స్పందిస్తూ జిల్లాలో బ్యాంక్ శాఖలు తక్కువగా ఉండటం, లబ్దిదారులు ఎత్తైన దూర ప్రాంతాలలో ఉండటం వల్ల వారికి ఇబ్బందులు కలగకుండా నగదు రూపంలో పంపిణీ చేయడం జరుగుతోందని, అయినప్పటికీ ఐవిఆర్ఎస్ విధానంలో పించన్లు సక్రమంగా అన్దుతున్నదీ లేనిదీ, ఎవరైనా డబ్బులు అడుగుతున్నదీ లేనిదీ తెలుసుకుంటున్నామని, అవినీతికి తావు ఎకుండా పారదర్శకంగా పంపిణీ జరుగుతోందని వివరించారు.ముందుగా గ్రామానికి చేరుకున్న బృందానికి పేసా కమిటీ సభ్యులు, గ్రామా ప్రజలు ఘనంగా స్వాగతించారు. సంప్రాదాయ పద్ధతిలో ఆకులతో చేసిన కిరీటాలను బృంద సభ్యులకు ధరింపజేసి నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం అరకు వ్యాలీ మండల౦ సుంకర మెట్ట గ్రామాన్ని సందర్శించి ఆ గ్రామ ప్రజలతో మమేకమయ్యారు.ఈ పర్యటనలో జాయింట్ సెక్రటరీతో పాటు కేంద్ర పంచాయతి రాజ్ శాఖ సంచాలకులు రామ్ ప్రతాప్, డిప్యూటీ సెక్రటరీ సునీల్ మీనా, అండర్ సెక్రటరీ తారా చంద్ర, ఇతర సభ్యులు, జేసి డా. ఎం జే అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఎఎస్పి ధీరజ్, డిపిఒ లవ రాజు, డివిజినల్ పిఒ పిఎస్ కుమార్, సిడిపిఒ ఝాన్సి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కార్మికుల బకాయిలు చెల్లించాలి.... సిఐటియు




పరవాడ, (విశాఖ సమాచారమ్):- జాతీయ ఉపాధి హామీ కార్మికుల 8 వారాల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన పరవాడలో శనివారం ఉపాధి హామీ కార్మికుల పని ప్రదేశంలో. సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా గని శెట్టి మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులు అర్ధాకులతో జీవిస్తున్నారని 8 వారాల నుండి వేతనాలు బకాయి పెట్టడం అన్యాయం అన్నారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పని చేస్తున్న కార్మికులకు మంచినీరు మజ్జిగ వంటివి సదుపాయం కల్పించాలని అన్నారు. పారకి తట్టకి గుంపాంకి డబ్బులు చెల్లించాలని, వేసవి వేతనం కూడా కలిపి 40% అదనంగా చెల్లించాలని , బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఉపాధి హామీ కార్మికులకు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని, రోజుకి 600 రూపాయలు వేతనం చెల్లించాలని, కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారంగా 309 రూపాయలు వేతనం చెల్లించాలని అన్నారు. ఉపాధి హామీ కార్మికులందరికీ మండలంలో అన్ని గ్రామాల్లోనూ పని కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లైవ్ ఆడిట్ పేరుతో ఉపాధి హామీ కార్మికులను వేధింపులకు గురి చేసే విధానం మానుకోవాలని కార్మికుల రక్షణకు సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రతి వారం వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని గని శెట్టి ప్రభుత్వాలను ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన వేతన బకాయిలు చెల్లించాలి



జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాఠశాల లో వండిపెట్టిన మధ్యాహ్నం భోజనం వేతన బకాయలు వెంటనే చెల్లించాలని నిర్వహకులు కోరారు.ఎం పి పి జి పి ఎస్ పాఠశాలలో వండి పెట్టిన వారికీ జనవరి నెల నుంచి నాలుగు నెలలు బాకాయ చెల్లించవలచి ఉన్నదని. మళ్ళీ జులై 12నుంచి పాఠశాల తెరుచుకుంటాయని విద్యార్థులు కు ఎలా వండిపే ట్టాలని నిర్వహకులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపించి నాలుగు నెలలు వేతనాలు వేంటనే చెల్లించాలనికోరారు. ఈ కార్యక్రమం లో నిర్వహకులు చిన్నారావు సత్తిబాబు నూకరాజు చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## డీఎస్సీ కరెంట్ ఎఫైర్స్

1 దేశంలో చేపలను అత్యధికంగా ఉత్పత్తి చేసే రాష్ట్రం ఏది ?
జ ఆంధ్ర ప్రదేశ్

2. 14 వ ఆర్థిక సంఘం నివేదిక ఆధారంగా దేశంలో గుజరాత్ తర్వాత రెండవ ధనిక రాష్ట్రం ఏది ?
జ. తెలంగాణ

3. ఇటీవల ప్రధాని మోదీ శ్రీలంక దేశ పర్యటనలో భాగంగా ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం అందుకున్నారు. ఆ పురస్కారం ఏది ?
జ శ్రీలంక మిత్ర విభూషణ

4. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ( ఐ సి సి ) చైర్మన్ ఎవరు ?
జ సౌరభ్ గంగూలీ

5. తెలంగాణ రాష్ట్రంలో ఎస్ సి వర్గీకరణ అమలుచేస్తూ ప్రభుత్వం ఎప్పుడు ఉత్తర్వులు జారీ చేసింది?
జ. ఏప్రిల్ 15, 2025

6. ఆంధ్ర ప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం ఎస్ సి వర్గీకరణ రిజర్వేషన్ అమలు ప్రక్రియ ఎప్పుడు మొదలు పెట్టింది ?
జ. ఏప్రిల్ 18, 2025

7. ప్రస్తుత న్యాయ (లా) కమిషన్ చైర్మన్ ఎవరు ?
జ. జస్టిస్ దినేష్ మహేశ్వరి (ఏప్రిల్ 15, 2025 న బాధ్యతలు చేపట్టారు )

8. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్ సి కమిషన్ చైర్మన్ గా ఇటీవల ఎవరు నియమితులైనారు ?
జ. శ్రీ కొత్తపల్లి శామ్యూల్ జవహర్

9. దేశంలోనే అత్యున్నత సాహితీ పురస్కారం జ్ఞానపీఠ్ అవార్డు 2024 ను అందుకున్నది ఎవరు ?
జ. ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా

10. నమీబియా దేశ మొట్టమొదటి అధ్యక్షురాలిగా నియమితులైన వారు ఎవరు ?
జ. నేటుంబో నాండి ఎన్ఎయిట్వా

11. భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ ఎన్ని రోజులు అంతరిక్ష కేంద్రం లో ఉన్నారు ?
జ. 286

12. దేశంలో ప్రస్తుతం ఉన్న లోకసభ స్థానాల సంఖ్య ఎప్పటి జనాభా లెక్కల ప్రకారం నిర్ణయించబడ్డాయి ?
జ. 1971

13. ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన నివేదిక ఆధారంగా ప్రసూతి మరణాల్లో భారత దేశం ఎన్నో స్థానంలో ఉంది ?
జ. రెండవ (2023 లో 19 వేలు)
నైజీరియా మొదటి స్థానం (75 వేలు )

14. ఆర్ బి ఐ డిప్యూటీ గవర్నర్ గా ఏప్రిల్ 2, 2025 న ఎవరు నియమితులైనారు ?
జ. పూనమ్ గుప్తా

15. వక్ఫ్ ( సవరణ) బిల్లు 2025 ఎప్పటి నుండి అమలులోకి వచ్చింది ?
జ. ఏప్రిల్ 8, 2025

16. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ లోని వెల్ బీయింగ్ రీసెర్చ్ సెంటర్ తయారు చేసిన ఆనందమయ దేశాల జాబితాలో ఫిన్లాండ్ మొదటి స్థానంలో నిలువగా భారత్ ఏ స్థానంలో ఉంది ?
జ. 118

17. మనదేశం ఒక్క రైల్వే స్టేషన్ కూడా లేని రాష్ట్రం ఏది?
జ. సిక్కిం

18. మన దేశంలో కొత్తగా పులుల రిజర్వ్ గా ప్రకటించిన గురు ఘాసీదాస్ తమోర్ సింగ్లా ఏ రాష్ట్రంలో ఉంది ?
జ. ఛత్తీస్ ఘడ్

19. భారత్ లో మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ కేంద్రాన్ని ఎక్కడ ప్రారంభిస్తున్నారు ?
జ. హైదరాబాద్

20. ఒక కంప్యూటర్ వేగాన్ని కొలిచేందుకు ఉపయోగించే యూనిట్ పేరేమిటి ?
జ. పెటాఫ్లాఫ్

డా జొన్నకూటి ప్రమోద్ కుమార్
9490833108.

# నగరంలో తిరిగి డబుల్ డెక్కర్ బస్సులు

● మొత్తం మూడు బస్సుల ఏర్పాటుకు సన్నాహాలు ● స్టీల్ ప్లాంట్ సీఎస్ఆర్ నిధులతో ఒకటి కొనుగోలు ● రెండు బస్సులు కొనుగోలు చేయనున్న జీవీఎంసీ ● సింహాచలం, కైలాసగిరి మార్గాల్లో నడిపే యోచన



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- నగరవాసులకు, పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచేందుకు విశాఖపట్నం రహదారులపై డబుల్ డెక్కర్ బస్సులు త్వరలోనే పరుగులు తీయనున్నాయి. ఈ మేరకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మొత్తం మూడు డబుల్ డెక్కర్ బస్సులను నగరానికి తీసుకురానున్నారు.

వీటిలో ఒక బస్సును స్టీల్‌ప్లాంట్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా సమకూరుస్తుండగా, మిగిలిన రెండు బస్సులను జీవీఎంసీ స్వయంగా కొనుగోలు చేయనుంది. ఈ బస్సుల కొనుగోలు ప్రక్రియలో భాగంగా జీవీఎంసీ ఇప్పటికే ప్రతిపాదనల అభ్యర్థన (ఆర్ఎఫ్‌పీ) టెండర్లను ఆహ్వానించింది.

ఈ డబుల్ డెక్కర్ బస్సులను ప్రధానంగా నగరంలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలైన సింహాచలం, కైలాసగిరి, తొట్లకొండ వంటి మార్గాల్లో నడిపేందుకు అధికారులు యోచిస్తున్నారు. దీనివల్ల నగర పర్యాటకం మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు.

వీలైనంత త్వరగా ఈ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జూన్ 10వ తేదీ నాటికి కనీసం ఒక బస్సునైనా సిద్ధం చేసి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభించాలని జీవీఎంసీ ఇంఛార్జి కమిషనర్ హరేంధిరప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ పరిణామంతో విశాఖ నగరానికి మరో కొత్త ఆకర్షణ తోడుకానుంది.

2nd pages1.qxd 5/31/2025 8:00 PM Page 6



# గోదావరి జిల్లాల సమాచారమ్

## ఐపీఎల్ వీక్షణకు ప్రత్యేక స్క్రీన్లు




**కాకినాడ రూరల్ (విశాఖ సమాచారమ్):-** ఐపీఎల్ మ్యాచ్ లు కోసం క్రికెట్ ప్రేక్షకులకు వీక్షించేందుకు ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాట్లను చేసినట్లు బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ ఆల్విన్ గైక్వాడ్ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయ ఇంచార్జ్ మేకా లక్ష్మణ మూర్తి తెలిపారు. శనివారం ఈ మ్యాచ్ లకు సంబంధించి స్క్రీన్ పై వీక్షించే ప్రేక్షకుల నిమిత్తం కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్లో వారు విలేకరులతో సమావేశాన్ని నిర్వహించి వెల్లడించారు. ఈ సందర్భంగా గైక్వాడ్, లక్ష్మణ మూర్తి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో తొలిసారిగా ఐపీఎల్ క్వాలిఫై ఫైనల్ మ్యాచ్ లు వీక్షణ కోసం కాకినాడలోని ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్లో పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. జూన్ 1వ తేదీన పంజాబ్ ముంబై జట్ల జరిగే క్వాలిఫై మ్యాచ్ తో పాటు మూడో తేదీన జరిగే ఫైనల్ కోసం ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఐపీఎల్ మ్యాచ్ లు ఎంతో ప్రాచుర్యం పొందాయని అందులో భాగంగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు కృషితో ఈ ప్రచార వేడుకలను స్క్రీన్లు పై ఏర్పాటు చేశామన్నారు. ఎంపీ సానా క్రీడా అభివృద్ధి చేస్తున్నారని కాకినాడలో స్టేడియం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నారని అలాగే ప్రతిభగల యువతకు నైపుణ్యాభివృద్ధికి తన వంతు ప్రయత్నం చేస్తున్నారని లక్షణ మూర్తి తెలిపారు.

## ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం




**తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):-**
**నియోజకవర్గ బ్యూరో ఇంచార్జ్ కొల్లి చిన్నబాబు ):**
తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం వైద్యాధికారిణి డాక్టర్ బీవీవీ భవాని ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ పి.హెచ్.సి. ఆవరణలో ఎవరూ దూమపానం చేయరాదని, కాన్సర్ వస్తుందని, అవగాహన కల్పించారు. సి.హెచ్.వో.ఎమ్. వెంకటేశ్వరావు మాట్లాడుతూ మైనర్ లకు సిగరెట్లు అమ్మ రాదు అని కోరారు.

## పెండ్యాల కృష్ణ బాబు పేరు మీద కమ్యూనిటీ హాల్స్ ప్రారంభోత్సవం



**చాగల్లు, (విశాఖ సమాచారమ్):-**
**నియోజకవర్గ బ్యూరో ఇంచార్జ్ కొల్లి చిన్నబాబు):**
చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో మాజీ శాసనసభ్యులు పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) జన్మదినోత్సవం పురస్కరించుకొని టీడీపీ నాయకులు ఎస్. రాజీవ్ కృష్ణ బ్రాహ్మణగూడెం గ్రామంలో శ్రీ వినాయక గౌడ సంఘ కమ్యూనిటీ హాల్, మరియు శ్రీకృష్ణదేవరాయ కాపు సేవా సంఘం కమ్యూనిటీ హాల్స్ ను కృష్ణ బాబు పేరు మీద బహుకరించి వారికి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ కృష్ణ మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి పైన ధ్యాస పెడుతుందన్నారు.

మన గ్రామాల్లో రోడ్లు మరియు డ్రైన్, బిల్డింగ్స్ ని బాగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చాగల్లు జడ్పిటిసి గారపాటి శ్రీనివాస్, నిడదవోలు జడ్పిటిసి కొయ్య సూరిబాబు, ఇమ్మాణి వీర శంకరం, రాజా బాబు, శివ, చాగల్లు మండల టిడిపి నాయకులు కార్యకర్తలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రహదారి ప్రమాదంలో ఒకరి దుర్మరణం

**మొగల్తూరు, (విశాఖ సమాచారమ్):-** రహదారి ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్సై జి.వాసు తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. నరసాపురం 3వ వార్డుకు చెందిన గొగులమండ నిరుపమతేజ తన ఇద్దరు మిత్రులతో కలిసి ఈ నెల 29న రాత్రి ద్విచక్ర వాహనంపై పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. తిరిగి వెళ్తుండగా రహదారిపై ఉన్న గుంతలో వీరి వాహనం పడటంతో ముగ్గురూ రహదారిపై పడ్డారు. తీవ్రంగా గాయపడిన నిరుపమతేజ సంఘటనా ప్రాంతంలోనే మృతి చెందారు. యువకుడి తల్లి విద్యులత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

# పతక రాణులు... సోదరీమణులు





**ఏలూరు, (విశాఖ సమాచారమ్):-** బీతన కలలను కుమార్తెల ద్వారా సాకారం చేసుకోవాలనుకున్నాడో తండ్రి. ఆయన కలల సాకారానికి శ్రమిస్తున్నారా తనయలు. కుంగ్‌ఫూలో రాణిస్తూ.. పతకాల మోత మోగిస్తున్నారు. ఏలూరు నగరం రామకృష్ణాపురానికి చెందిన బోశెట్టి దుర్గామల్లేశ్వరరావు, శ్రావణి దంపతులకు నిశిత, గీత కుమార్తెలున్నారు. అక్కాచెల్లెళ్లు బాల్యం నుంచే కుంగ్ ఫూలో శిక్షకుడు వేణుగోపాల్ శ్రీనివాస్ నేతృత్వంలో రాటుదేలుతున్నారు. కర్ర, కత్తిసాములతో పాటు మార్షల్ ఆర్ట్స్ తదితరాల్లో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అనేక పతకాలు, బహుమతులు కైవసం చేసుకున్నారీ సోదరీమణులు.

**అంతర్జాతీయ స్థాయిలో..**

'ప్రస్తుతం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. ఎనిమిదేళ్లుగా కుంగ్ ఫూలో శిక్షణ పొందుతున్నా. తద్వారా క్రమశిక్షణ, ఆత్మరక్షణ పెంపొందించుకున్నా. మానసిక శక్తి, శారీరక దారుఢ్యం పెరిగింది. కుంగ్‌ఫూలో బ్లాక్, బ్రౌన్, గ్రీన్ బెల్టులు సొంతం చేసుకున్నా. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన పలు పోటీల్లో పాల్గొని పతకాలు సాధించా. నాన్న బ్యాంకులో భద్రతా సిబ్బందిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన కల సాకారం చేసేలా కుంగ్‌ఫూలో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నదే ఆశయం. ఇంజినీరింగ్‌లో రాణించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా స్థిరపడతా' అని బోశెట్టి నిశిత తెలిపారు.

**పోలీసు అవుతా..**

నేను పదో తరగతి చదువుతున్నా. అక్క నిశితను స్ఫూర్తిగా తీసుకొని కుంగ్‌ఫూలో శిక్షణ పొందుతున్నా. ఆమెకు ఎక్కడా తీసిపోకుండా రాష్ట్ర స్థాయిలో బహుమతులు, పతకాలు సొంతం చేసుకున్నా. బ్రౌన్, గ్రీన్ బెల్టులు సాధించా. క్రమశిక్షణ, స్వీయరక్షణకు కుంగ్‌ఫూ దోహదపడుతుంది. ఈ క్రీడలో రాణించడంతో పాటు బాగా చదువుకొని పోలీసు అవ్వాలన్నదే నా కల' అని బోశెట్టి గీత పేర్కొన్నారు.

# సుజలం.. ప్లాంట్ సాకారంతో సుఫలం



**రాజమహేంద్రవరం, (విశాఖ సమాచారమ్):-** గోదావరి కాలుష్య నివారణలో భాగంగా ఆవ ప్రాంతంలో ఎస్టీపీ(మురుగునీటి శుద్ధీకరణ ప్లాంటు) నిర్మాణ పనులు కొలిక్కి వస్తున్నాయి. 50 శాతం వరకూ నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో యంత్రాల ఏర్పాటు, పనితీరు పరిశీలనకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటి వరకూ నిర్మాణ పనులు చాలా వరకూ పూర్తి చేశారు.

**భారీ సంపుల నిర్మాణం**

ప్లాంటు నిర్మాణంలో భాగంగా ప్రధానమైన బేస్‌మెంట్ పనులు పూర్తి చేశారు. దీనికి అనుబంధంగా రెండు సంపులు ఏకకాలంలో నిర్మిస్తున్నారు. అవి పూర్తి కాగానే యంత్రాల అమరికపైనే ప్లాంట్ నిర్మాణం ఆధారపడుతుంది. వచ్చే ఆగస్టు నాటికి కట్టడాలు పూర్తై.. ఆ తర్వాత యంత్ర సామగ్రి ఏర్పాటు ప్రారంభిస్తారు. అందుకు మరో మూడు నెలల వ్యవధి పడుతుందని, ఈ ఏడాది చివరి నాటికి పూర్తిస్థాయిలో ప్లాంటు అందుబాటులోకి వస్తుందని అధికారులు స్పష్టత ఇచ్చారు.

**నిర్మాణంలో సంపు**

నదీ కాలుష్యం పెరుగుతున్న తీరు.. నమామి గోదావరి ప్రాజెక్టు కల సాకారం కావాల్సిన అవసరంపై స్పందించిన యంత్రాంగం చకచకా ప్లాంట్ నిర్మాణం చేపడుతోంది. తొలి విడత నిధులతో ఈ పనులు చేపట్టారు. ఆవ ప్రాంతంలో ఏడు ఎకరాల్లో 50.6 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మురుగు నీటి శుద్ధీకరణ ప్లాంటు నిర్మాణం జరుగుతోంది. ప్లాంటుకు అనుబంధంగా పక్కనే 5 ఎంఎల్‌డీ ప్లాంటు కూడా సిద్ధమవుతోంది. మురుగు నీటిని శుద్ధి చేసి తిరిగి గోదావరిలో కలిపే ప్రక్రియలో భాగంగా ప్లాంట్ పనులు ప్రారంభించారు. మురుగును వివిధ దశల్లో శుద్ధి చేసే క్రమంలో సంపు ద్వారా పంపింగ్ చేస్తారు. అందుకోసం భారీ సంపులను నిర్మించాల్సి ఉంటుంది. నీటిని ఫిల్టర్ చేసే విధంగా సంపుల్లో రసాయనిక ప్రక్రియ జరుగుతుంది. అందుకోసం రెసిప్‌మెంట్, ప్రైమరీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను సిద్ధం చేయాల్సి ఉంటుంది. నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గర్గ్ పనులు పర్యవేక్షిస్తున్నారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో పనులు వేగవంతం చేశారు.

# మూడేళ్లుగా నిర్మాణం.. నిధుల్లేక జాప్యం



**రాజానగరం, (విశాఖ సమాచారమ్):-** కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా పథకం కింద మూడేళ్ల క్రితం నన్నయ విశ్వవిద్యాలయానికి మంజూరు చేసిన బహుళ సముదాయక ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు 81 శాతం పనులు పూర్తయినట్టు వినియోగ ధ్రువపత్రం ఇవ్వడంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) రూ.3.67 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.2.7 కోట్లను గత ఏడాది జులైలో కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. పర్యవేక్షణకు వచ్చిన రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ రవినాయుడు వర్సిటీలో నిర్మాణాలను పరిశీలించి.. జరిగిన పనులకు, ఖర్చు చేసిన నిధులకు పొంతన లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

**40 శాతం పనులు మాత్రమే పూర్తి..**

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అంచనా వ్యయం రూ.10 కోట్లుకాగా శాయ్ రూ.3.90 కోట్లు మంజూరు చేసింది. రూ.3.67 కోట్లు విడుదల కావడంతో 2022 మార్చిలో పనులు ప్రారంభించారు. అదే సంవత్సరం డిసెంబరు నాటికి అందుబాటులోకి తేవాలని లక్ష్యంకాగా, ఇప్పటి వరకు 40 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.3.80 కోట్లు అంచనా వ్యయంకాగా శాయ్ రూ.2.72 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.1.85 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటి వరకు 65 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

**వర్సిటీ నిధులు వెచ్చిస్తాం..**

బహుళ సముదాయక ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన నిధులను మొత్తం ఖర్చు చేశాం. ఇంకా మిగిలిన పనులకు విశ్వవిద్యాలయ నిధులు వెచ్చించేందుకు నిర్ణయించాం. 2024 సాధారణ ఎన్నికల సందర్భంగా వర్సిటీ ప్రాంగణాన్ని ప్రభుత్వం వినియోగించుకోవడం, ఇసుక కొరత కారణంగా పనుల్లో జాప్యం జరిగింది. స్విమ్మింగ్ పూల్ నిర్మాణం ఈ ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేస్తాం అని .ఎస్.ప్రసన్నశ్రీ, వీసీ, నన్నయ విశ్వవిద్యాలయం%రి% వారు తెలియ చేశారు.

# ఇదా సన్నద్ధత..?



**జంగారెడ్డిగూడెం, (విశాఖ సమాచారమ్):-** మళ్లీ కొవిడ్ ప్రభావం కనిపిస్తున్న నేపథ్యంలో వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులు ముందుగానే సన్నద్ధం కావాలి. అయితే జిల్లాలో ఒకటీ అరా ప్రాంతీయ ఆసుపత్రులు మినహా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో అటువంటి ఏర్పాట్లు ఏమీ లేవు.

జిల్లాలోని పలు ప్రాంతీయ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను పరిశీలించగా చాలా చోట్ల ఏర్పాట్లు కానరాలేదు. జిల్లా స్థాయిలో సన్నద్ధతలోనే ఉన్నామని, సమావేశాలు పెట్టామని వైద్యాధికారులు అంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. దగ్గు, జలుబు, జ్వరాలతో రోగులు వస్తున్నప్పటికీ కరోనా కేసులు ఏమీ లేకపోవడంతో వచ్చాక చూద్దాంలే అన్నట్లుగా ఉంది.

నాలుగు పడకలతో.. జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రిలో నాలుగు పడకలతో ప్రత్యేక కొవిడ్ విభాగం ఏర్పాటు చేశారు. కొవిడ్ లక్షణాలతో ఎవరైనా వస్తే నమూనాలు తీసి పరీక్షలు చేస్తామని, ఇందుకు అవసరమైన ర్యాపిడ్ కిట్లు అందుబాటులో ఉన్నాయని సూపరింటెండెంట్ బేబీ కమల, ఆర్ఎంఓ రాంబాబు తెలిపారు.

**ఉత్తర్వులు లేవట :** పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గతంలో ఉన్న వెంటిలేటర్లు, ఆక్సిజన్ సిలిండర్లు తప్ప ప్రత్యేకంగా ఇక్కడ ఏర్పాట్లు లేవు. బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్యకేంద్రంలోనూ ఇదే పరిస్థితి.

**అప్రమత్తంగా ఉన్నాం..** కొవిడ్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నట్లు డీస్మీహెచ్ఎస్ పాల్‌సతీశ్ చెప్పారు. ఎవరికైనా కొవిడ్ లక్షణాలు ఉంటే నమూనాలు తీసుకొని ఏలూరు వీఆర్‌డీఎల్ ల్యాబరేటరీకి పంపాలని వైద్యులకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ప్రత్యేక వార్డులు, పడకలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించామని, సమావేశాలు నిర్వహించామని అన్నారు.

## అర్ధరాత్రి అనుకోని కుదుపు



**భీమడోలు/ఏలూరు, (విశాఖ సమాచారమ్):-** చల్ల గాలి.. తుంపరగా కురుస్తున్న వాన జల్లులు.. అంతా హాయిగా నిద్రిస్తున్నారు.. ఈలోపు అనుకోని కుదుపు. ఏమైందో తెలుసుకునే లోపు.. బస్సు తలకిందులైంది. ప్రయాణికుల హాహాకారాలతో ఆ ప్రాంతమంతా భీతిల్లింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు శుక్రవారం రాత్రి బయల్దేరింది. మార్గం మధ్యలోని ఏలూరు జిల్లా భీమడోలు, దెందులూరు మండలాల సరిహద్దు సూరప్పరెడ్డిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై ఓ లారీ బోల్తా పడింది. అతివేగంగా వస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన డ్రైవర్ సూరిబాబు లారీని గమనించి, ఒక్కసారిగా బస్సును కుడి వైపునకు తిప్పారు. వేగాన్ని అదుపు చేయలేకపోవడంతో.. బస్సు డివైడర్‌ను దాటుకొని బోల్తా పడింది. ఈ ఘటనలో సుమారు 16 మందికి పైగా ప్రయాణికులకు స్వల్ప, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను బస్సులో నుంచి బయటకు తీశారు. వారిని మూడు అంబులెన్స్‌ల్లో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

**అంబులెన్స్‌లో క్షతగాత్రుడికి చికిత్స**

మరో ఘటనలో.. ఇదే మార్గంలోని సూరప్పరెడ్డిగూడెం సమీపంలోనే మరో ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ప్రయాణికులకు ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాసేపటి తర్వాత బస్సు బయల్దేరి వెళ్లిపోయింది.

## ప్రభుత్వ ఉద్యోగాలంటూ మోసం



**భీమడోలు, (విశాఖ సమాచారమ్):-** ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని, స్థిరాస్తి కొనుగోలు చేస్తామని పలువురిని మోసం చేసిన ఇద్దరు నిందితులను భీమడోలు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ యు.జె.విల్సన్, ఎస్సై వై.సుధాకర్ కేసు వివరాలు వెల్లడించారు. పోలసానిపల్లికి చెందిన దివ్యాంగుడు కుక్కల నాగమల్లేశ్వరరావు భీమడోలులోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో పని చేస్తున్నారు. ఈయనకు హైదరాబాద్ తుక్కుగూడకు చెందిన షేక్ రసూల్ కలకాడ, అతడి కుమారుడు అల్తాఫ్‌తో పరిచయమైంది. తమకు పోలీసు ఉన్నతాధికారులు, పలువురు మంత్రులతో సన్నిహిత సంబంధాలున్నాయని, రాష్ట్ర సచివాలయం లేదా అమరావతిలోని వ్యవసాయ విభాగంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తామంటూ తండ్రీకొడుకు కలిసి నాగమల్లేశ్వరరావును నమ్మించి రూ.3 లక్షలు వసూలు చేశారు. ఆపై నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వడంతో ఆయన అమరావతి వెళ్లారు. అక్కడ లెటర్ నకిలీదని తేలడంతో మోసపోయినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తీగ లాగితే.. పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెలుగు చూశాయి. నిందితులు పలువురు అమాయకులను మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది. ద్వారకాతిరుమల మండలం దేవినేనివారిగూడేనికి చెందిన సుంకవల్లి శ్రావణ్‌కుమార్ పొలం కొంటామని నమ్మించి, అతడికి నకిలీ సంతకాలు చేసిన రెండు చెక్కులిచ్చి భూమి కాజేసేందుకు ప్రయత్నించారు. పుళ్ల గ్రామానికి చెందిన దూలం సాయి బాబుకు పోలీసు ఉద్యోగం ఇప్పిస్తామని రూ.20 లక్షలు తీసుకొని మోసగించినట్లు తేలింది. పక్కా సమాచారంతో నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

## లారీని ఢీకొని వ్యాన్ డ్రైవర్ మృతి

### నుజ్జయిన వ్యాన్‌లో డ్రైవర్ మృతదేహం




**దేవరపల్లి, (విశాఖ సమాచారమ్):-** దేవరపల్లిలోని జాతీయ రహదారిలో డైమండ్ జంక్షన్ సమీపంలో వంతెన ఎక్కుతున్న లారీని వెనుక నుంచి ఐసర్ వ్యాన్ శుక్రవారం ఉదయం ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ దుర్మరణం చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఈ.శంకర్(31) ఇనుప పైపుల లోడుతో రాజమహేంద్రవరం వైపు నుంచి ఏలూరు వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో ప్లాస్టిక్ లోడుతో ముందు వెళుతున్న కంటైనర్‌ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యి శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఎవరూ రాలేదని, ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

2nd pages1.qxd 5/31/2025 8:00 PM Page 7



## దొంగతనం కేసులో ముద్దాయి అరెస్టు

డి.ఎస్.పి విష్ణు స్వరూప్



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** పగటి దొంగతనం కేసులో ముద్దాయినీ అరెస్టు చేసినట్లు డీఎస్పీ విష్ణు స్వరూప్ తెలిపారు. వివరాలు కి వెళితే పరవాడ జె ఎన్ ఎన్ యు ఆర్ ఎం కాలనీలో సుమారు సంవత్సరం నుండి 7 పగటి దొంగతనాలు చేసి తెలివిగా తప్పించుకు తిరుగుతున్న విజయనగరం జిల్లా, గరివిడి మండలం, కాపు సంభవం గ్రామానికి చెందిన మొగుడి రాంబాబు (30) ను శనివారం సాయంత్రం లంకెలపాలెం జంక్షన్ వద్ద సీఐ మల్లికార్జున సమక్షంలో క్రైమ్ సిబ్బంది, ఎస్సై కృష్ణారావు, కానిస్టేబుల్ నాయుడు, సాయి సంతోష్ ముద్దాయిని అదుపులోకి తీసుకున్నారు. ఇతను వద్దనుండి 10.5 తులాల బంగారం, 39 తులాల వెండి, 1,30,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగ్కు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ముద్దాయిని కోర్టుకు పంపుతామని అన్నారు.

## నేటి నుండి చౌక ధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జూన్ 1వ తేదీ నుండి నిత్యావసర సరుకులు చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో ప్రారంభం కావాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో అదికారులతో సమావేశం ఏర్పాటుచేసి పంపిణీ ఏర్పాట్లను సమీక్షించారు. జిల్లాలో గల 1069 చౌక ధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, అన్ని దుకాణాల ద్వారా సరుకులు సక్రమంగా పంపిణీ జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. జూన్ 1 వ తేదీ నుండి 15వ తేదీన లోపల కుటుంబంలోని ఎవరైనా వెళ్లి సరుకులు పొందవచ్చునని తెలియజేశారు. చౌక ధరల దుకాణాలు ఉదయం 8 నుండి 12 గంటలు వరకు మరియు మధ్యాహ్నం 4 నుండి 8 గంటల వరకు పనిచేస్తాయని, ఆ సమయంలో లబ్ధిదారులు సరుకులు తీసుకోవాలని తెలిపారు. 65 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు మరియు విభిన్న ప్రతిభావంతులకు 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 నుండి 4 గంటల సమయంలో వారి ఇంటి వద్దకే సరుకులు అందజేయడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, జిల్లా సప్లయి అధికారి కె.ఎల్.ఎన్. మూర్తి, ఇతర అదికారులు పాల్గొన్నారు.

## వీఎంఆర్‌డీఏకి చెందిన భూమిని అభివృద్ధి చేయడానికి రోడ్ షో



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా నిర్దేశిస్తున్న లక్ష్యాలను చేరుకునేందుకు, ఆర్థిక రాజధానిగా రూపాంతరం చెందుతున్న విశాఖను మరింత అభివృద్ధి చేసే దిశగా తీసుకొంటున్న చర్యల్లో భాగంగా మధురవాడలో ఉన్నటువంటి వీఎంఆర్‌డీఏకి చెందిన (మధురవాడ హైట్స్) 87.80 ఎకరాల భూమిని సంయుక్తంగా (జాయింట్ గా) అభివృద్ధి చేసేందుకు ఆసక్తి కలిగిన వారికోసం బెంగుళూరు లో నైట్ ఫ్రాంక్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్ షో కార్యక్రమానికి ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ సంస్థలైన గోద్రెజ్ ప్రాపర్టీస్, ఉషా శ్రీరామ్ ప్రాపర్టీస్ మరియు స్థానిక రియల్ ఎస్టేట్ సంస్థలు పాల్గొన్నాయి అని వారు సూచన ప్రాయంగా తమయొక్క సంసిద్ధతను వ్యక్తం చేశారని జాయింట్ కమిషనర్ రమేష్ తెలిపారు. ఈ రోడ్ షోలో ప్రధాన చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్పా, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్,రోడ్ షో నిర్వాహకులు నైట్ ఫ్రాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో సోలార్ వెండర్స్ సమావేశం





లక్ష వినియోగదారులకు పథకం లక్ష్యంగా ఏపీఈపిడీసిఎల్ ప్రధాన మంత్రి ముఫ్తీ బిజిలీ యోజన పథకం అమలు కోసం సోలార్ వెండర్స్ సమావేశం 30/5/2025 ఏపీ ఈపిడీసిఎల్ కార్పోరేట్ కార్యాలయంలో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు డైరెక్టర్ పవర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి అనేక జిల్లాలనుంచి సుమారు నూట పదిహేను మంది ప్రధాన మంత్రి ముఫ్తీ బిజిలీ యోజన పథకం కింద రిజిస్టర్డ్ వెండర్స్ హాజరు అయినారు.

వెండర్స్ ఎదురు కుంటున్న సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ సోలార్ ఇంటిగ్రేటర్స్ అసోసియేషన్ కోర్ కమిటీ కోరింది. ప్రధానమంత్రి ముఫ్తీ బిజిలీ యోజన పథకం కి అదనంగా,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీ సీ వినియోగదారులకు ఇరవై వేల రూపాయలు రాయితీ ప్రకటించినట్లు ఏపీ ఈపిడీసిఎల్ అధికారులు తెలిపారు.

పథకం అమలులో జాప్యం లేకుండా చూడాలని క్రింద స్థాయి డిస్కాం అధికారులు సహకారం చాలా అవసరం అని వెండర్స్ పేర్కొన్నారు.

డీసీ ఆర్ పేనెల్సు కుత్రిమ కొరత కారణం,ధర పెంపు వంటి విషయాలు ప్రస్తావనకు వచ్చింది.

ఆర్ ఈ సీ అధికారులు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## పొలమే బడి... పైకెదగొచ్చు పోటీపడి





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** పదో తరగతి పరీక్ష ఫలితాలు వచ్చాయి. ఉత్తీర్ణత సాధించినవారిలో అధికశాతం ఇంటర్‌లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్ పూర్తిచేసి ఈఏపీ సెట్ రాసి ఇంజినీర్, డాక్టరు కావాలని ఎక్కువమంది ఆలోచిస్తున్నారు. కేవలం ఇవే కాదు.. ఎన్నో మంచి కోర్సులు అందుబాటులో ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. చిన్న వయస్సులోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తున్న కోర్సుల్లో వ్యవసాయ పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కోర్సులు ముందు ఉంటాయి. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు వ్యవసాయ పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరవచ్చు. పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు ఈనెల 28 నుంచి జూన్ 16 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

**ఉన్నత విద్యకు అవకాశం**

రెండేళ్ల కాలవ్యవధి కలిగిన వ్యవసాయ పాలిటెక్నిక్ చదివిన వారికి అగ్రికల్చర్ బీఎస్సీ మొదటి సంవత్సరంలో, మూడేళ్ల కాలవ్యవధి కలిగిన ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ చదివిన వారికి బీటెక్ రెండో ఏడాదిలో చేరే అవకాశం కల్పిస్తున్నారు. ఈసెట్ పరీక్షలో వచ్చే ర్యాంకు ఆధారంగా నేరుగా బీటెక్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. గతేడాది అనకాపల్లిలో చదివిన 9 మంది బీటెక్‌లో చేరారు. అగ్రిసెట్‌లో ర్యాంకు వచ్చిన వారు అగ్రికల్చర్ బీఎస్సీలో చేరవచ్చు. గతేడాది అనకాపల్లి నుంచి 18 మంది చేరారు.

**అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం**

**గ్రామీణులకు చక్కటి వరం**

అనకాపల్లిలో ప్రభుత్వ వ్యవసాయ, ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వ్యవసాయ పాలిటెక్నిక్‌లో 51 సీట్లు, ఇంజినీరింగ్‌లో 30 సీట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతంలో చదివిన వారికి 25 శాతం సీట్లు కేటాయించారు. విధిగా నాలుగు సంవత్సరాలు గ్రామీణ ప్రాంతంలో చదవాలి.

**ఇవీ నిబంధనలు**

పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన, ఇంటర్ తప్పిన విద్యార్థులు అర్హులు. ఓపెన్ స్కూల్, ఇన్‌స్టెంట్ పరీక్ష రాసినవారూ అర్హులే. ఇంటర్ ఉత్తీర్ణత సాధిస్తే అనర్హులు. వయసు 15 నుంచి 22 సంవత్సరాలలోపు ఉండాలి. ఆంగ్లంలో బోధన ఉంటుంది.

మొత్తం సీట్లలో ఎస్టీలకు 6 శాతం, ఎస్సీలకు 15, బీసీలకు 29, దివ్యాంగులకు 5 శాతం కేటాయిస్తారు. ఎన్‌సీసీ, క్రీడాకారులు, ఆర్మీలో పనిచేవారి పిల్లలకు రిజర్వేషన్లు ఉన్నాయి. మొత్తం సీట్లలో 33.3 శాతం బాలికలకు కేటాయించారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు సేద్య విభాగం, భూసారంలో.. ఇంజినీరింగ్ విద్యార్థులకు పరికరాలు, యంత్రాలపై బోధిస్తారు.

**మంచి డిమాండ్ ఉంది**

వ్యవసాయ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ రెండింటికీ మంచి డిమాండ్ ఉంది. తొలి కౌన్సెలింగ్‌లోనే సీట్లన్నీ పూర్తయి పోతున్నాయి. ఇక్కడ చదివిన విద్యార్థులకు అగ్రికల్చర్ బీఎస్సీ, బీటెక్‌లలో సీట్లు వస్తున్నాయి. కంపెనీలు కళాశాలలకే వచ్చి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి.

## 38మంది ఎయిడెడ్ అధ్యాపకులు వెనక్కి..




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గత వైకాపా ప్రభుత్వం దొడ్డిదారిన నియమించిన ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకులను వెనక్కి పంపిస్తూ వీసీ జి.పి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత దస్త్రంపై సంతకం చేశారు. అప్పటి ఉపకులపతి ఆచార్య ప్రసాదరెడ్డి తీసుకున్న పలు అక్రమ నిర్ణయాల్లో ఎయిడెడ్ అధ్యాపకుల నియామకం ఒకటి. ఈ వ్యవహారంపై అప్పట్లో ఏయూలో పలువురు రోజుల తరబడి నిరసనలు తెలిపినా ఖాతరు చేయలేదు.

ఈ ఏడాది మార్చిలోనే కమిషనర్ లేఖ: డిగ్రీ ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులను ఏయూలో చేర్చాలని గత వీసీ ప్రసాదరెడ్డి సిఫార్సు చేశారు. ఈ మేరకు 2021లో నాటి వైకాపా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 113 మంది సమ్మతి తెలపగా వారిలో 83 మంది మాత్రమే ఆన్ డ్యూటీ కింద ఏయూలో చేరారు. వివిధ కారణాలతో 43 మంది తిరిగి వెనక్కి వెళ్లిపోయారు. మిగిలిన 40 మందిలో ఒకరు చనిపోగా తెలుగు విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ బూసి వెంకటస్వామి గత నెలలో బయటకు వెళ్లిపోయారు. చివరికి 38 మంది మాత్రమే మిగిలారు. ఈ తరుణంలో ఎయిడెడ్ అధ్యాపకులను కొనసాగిస్తారా.. తొలగిస్తారా.. అంటూ ఈ ఏడాది మార్చిలో ఉన్నత విద్యా మండలి కమిషనర్ ఏయూ వీసీకి లేఖ రాశారు. అదే నెలలో వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జి.పి.రాజశేఖర్ ఈ విషయమై పూర్తి వివరాలు తెలుసుకున్నాక నిర్ణయం తీసుకుంటానని సమాధానమిచ్చారు.

గత వారం ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, డీన్‌లతో వీసీ సమావేశమై అభిప్రాయం కోరగా, అధికశాతం వెనక్కి పంపించాలని చెప్పడంతో వీసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏయూ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయంపై వీసీ కమిషనర్‌కు లేఖ రాయగా తక్షణమే తొలగించాలని సమాచారం పంపినట్లు తెలిసింది. నెలాఖరుకు రెండు రోజులు ఉండగా ఇప్పుడు వెనక్కి పంపిస్తే రెండు రోజుల సర్వీసు నష్టపోతామని ఎయిడెడ్ అధ్యాపకులు చెప్పడంతో శనివారం సాయంత్రం విధుల నుంచి రిలీవ్ చేయాలని వీసీ నిర్ణయించారు.

## వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్

జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో గల వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ వేయడం జరుగుతుందని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ పరిధిలోని పెదగదిలి వద్ద వీధి కుక్కలకు యాంటీ రబీస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జీవీఎంసీ వెటర్నరీ డాక్టర్ ఎన్. కిషోర్ కుమార్ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి మాట్లాడుతూ నగరంలోని వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ వేయడం జరుగుతుందని, శనివారం పెదగదిలి వద్ద 52 వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ వేసి రేబిస్ నిర్మూలన టీకా కార్యక్రమం నిర్వహించడమైనదన్నారు. ఇది నిరంతరం ప్రతి వార్డులో వేస్తున్నామన్నారు. తెలిపారు. అలాగే ప్రతి పిహెచ్ సెంటర్లో జీవీఎంసీ కార్మికుల తోపాటు ప్రజలకు రాబిస్ వ్యాధి సోకకుండా వ్యాక్సినేషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.ఎస్.పి.సి.ఎ ప్రతినిధులు ప్రదీప్ రాజు, శారద జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన డాన్స్ అండ్ మ్యూజిక్ సమ్మర్ క్లాసులు



**తాళ్లపూడి , (విశాఖ సమాచారమ్ నియోజకవర్గ బ్యూరో కొల్లి చిన్నబాబు):** బాల్యం నుంచే విద్యతో పాటుగా విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీయడానికి సహ పాఠ్య కార్యక్రమాలైనా డాన్స్, మ్యూజిక్, చెస్, కీబోర్డ్ ఎంతగానో ఉపయోగపడతాయని మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ వివి అనీష్ తెలిపారు. డాన్స్ అండ్ మ్యూజిక్, కీబోర్డ్, చెస్ సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా కూచిపూడి డాన్స్ మాస్టర్ ప్రభాకరరావు మాట్లాడుతూ మొదటి సారిగా తాళ్లపూడి లోని మాంటిస్సోరి స్కూల్లో ఏర్పాటు చేసిన డాన్స్ అండ్ మ్యూజిక్ సమ్మర్ క్లాసులకు మంచి ఆదరణ లభించిందని తెలిపారు. విద్యార్థులు వారిలో ఉన్న నైపుణ్యాన్ని డాన్స్ ద్వారా వ్యక్త పరిచారని గ్రామీణ ప్రాంతంలో కూచిపూడి డాన్స్ క్లాస్ నిర్వహించడం విశేషం. స్కూల్ కరెస్పాండెంట్ అనీష్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా డాన్స్ మ్యూజిక్ క్లాసు నిర్వహించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే సంవత్సరం విద్యార్థులకు డ్రాయింగ్, డాన్స్, మ్యూజిక్, చెస్, కరాటి వంటి వాటిల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి నేషనల్ స్థాయికి పంపడానికి కృషి చేస్తామని ప్రభాకర్ తెలిపారు.

## వడ్డాదిలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పేద ప్రజలకు 1వ తారీకు ఆదివారం వచ్చినందున 31 న శనివారం ముందు రోజే పంపిణీ చెయ్యమని ఆదేశాలు మేరకు మేరకు మేజర్ పంచాయితీ వడ్డాది గ్రామం లో హరిజన కాలనీ లో వడ్డాది తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోరు కొండ గురుమూర్తి చేతుల మీదగా పెన్షన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ మామిడి వెంకటస్వామి, బైపు శ్రీను,బైపు కామరాజు, కోరుకొండ. చంద్రరావు, బైపు గోవింద తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం 31 వ వార్డు మన ప్రియతమ నేత మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగానే ఫెక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న 31 వ వార్డు టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ వానపల్లి గాయత్రి ఫణి కుమారి వార్డ్ అధ్యక్షులు సారి పిల్లి మహేష్ పిడి మేడం, ఎపిడి మేడం బూత్ అధ్యక్షులు ఎల్లాజీ ఆటాడఅప్పారావు, యూనిట్ ఇంచార్జి నాని, సచివాలయం సిబ్బంది పెన్షన్ దారులకు పెన్షన్ అందజేశారు.

## జూన్ 2న కేడీపేటలో 1000 మందితో యోగా ప్రదర్శన కార్యక్రమం



### జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా జూన్ 2న తేదీ సోమవారం నర్సీపట్నం నియోజకవర్గం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట లో పర్యాటక ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు పార్క్ వద్ద వేయి మందితో జిల్లా స్థాయి యోగా ప్రదర్శన నిర్వహిస్తున్నన్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంనుండి యోగాంధ్ర-2025 కార్యక్రమ ఏర్పాట్లపై జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 2వ తేదీ సోమవారం నర్సీపట్నం నియోజకవర్గం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట లో అల్లూరి సీతారామరాజు పార్క్ వద్ద వెయ్యి మందితో పెద్ద ఎత్తున జిల్లా స్థాయి యోగా ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి లోకసభ పార్లమెంటు సభ్యులు సి.ఎం. రమేష్ ముఖ్య అతిధిగా హాజరవుతారని కలెక్టర్ తెలిపారు.నియోజకవర్గం పరిధిలో గల నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం మండలాలకు చెందిన అధికారులతో పాటు యోగాపట్ల ఆసక్తి ఉన్నవారంతా ఈ ప్రదర్శనలో పాల్గొనాలని తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు కూడా ఈ ప్రదర్శనలో పాల్గొనాలని ఆమె కోరారు. వేదిక, పిఏ సిస్టం, పచ్చ రంగు తివాచి, జెండాలు, బ్యాక్ డ్రాప్ బ్యానర్లు, మంచినీరు, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లు చేసి వచ్చిన ప్రజలకు ఎలాంటి సౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.యోగా కార్యక్రమంపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచార కల్పించాలని, కార్యక్రమానికి సంబంధించి ప్రజలలో అవగాహన కలిగించుటకుగాను వివిధ అంశాలలో పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతి సచివాలయం ఉద్యోగి 150 మందికి యోగాలో శిక్షణ అందించాలని, వారినందరిని యోగా యాప్ నందు నమోదుచేయాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, రెవిన్యూ డివిజినల్ అదికారి షేక్ ఆయిషా, జిల్లా గణాంకాధికారి (సి.పి.ఒ.) జి.రామారావు, జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషా రాణి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె. మనోరమ, నియోజకవర్గ, మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## తొట్లకొండపై నేడు యోగాసనాలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల నేపథ్యంలో జూన్ ఆదివారం ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రమైన తొట్లకొండపై యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు టూరిజం అధికారిణి జె. మాధవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి 8.00 గంటల మధ్యలో ఇండియన్ నేవీ, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వివిధ యోగా అసోసియేషన్ల సభ్యులు, జిల్లా అధికారులు సుమారు వెయ్యి మంది ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై యోగాసనాలు వేయనున్నారని చెప్పారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని చెప్పారు. సాధారణ పౌరులు కూడా కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

2nd pages1.qxd 5/31/2025 8:00 PM Page 8



# క్రీడా సమాచారమ్

## పరుగుల వీరుడు అతడేనా? వికెట్ల ధీరుడిగా నిలిచేదెవరు?



**ఇంటర్నెట్ డెస్క్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ నాకౌట్ స్టేజ్‌కు చేరుకుంది. తొలి క్వాలిఫయర్, ఎలిమినేటర్ మ్యాచ్‌లు ముగిశాయి. ఇక రెండో క్వాలిఫయర్, ఫైనల్ మాత్రమే బాకీ. అత్యధిక పరుగులు చేసే బ్యాటర్లకు ఇచ్చే 'ఆరెంజ్ క్యాప్', ఎక్కువ వికెట్లు తీసిన బౌలర్‌కు ఇచ్చే 'పర్పుల్ క్యాప్'ను ఎవరు సొంతం చేసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. మరి ఈ రేసులో ఎవరు ఉన్నారు? ఎవరికి అవకాశం ఉందో ఓ లుక్కేద్దాం.

గుజరాత్ టైటాన్స్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఓడి ఇంటిముఖం పట్టింది. ముంబయి విజేతగా నిలిచి రెండో క్వాలిఫయర్‌కు దూసుకెళ్లింది. గుజరాత్ ఆటగాడు సాయి సుదర్శన్ (80) కీలక ఇన్నింగ్స్ ఆడినా జట్టును గెలిపించుకోలేకపోయాడు. అయితే, అతడు ఆరెంజ్ క్యాప్ రేసులో మాత్రం దూసుకుపోయాడు. ప్రస్తుతం 759 పరుగులు చేసిన సాయి టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. ఇక పర్పుల్ క్యాప్‌ను దక్కించుకొనేందుకు గుజరాత్ టైటాన్స్ బౌలరే రేసులో ఉండటం విశేషం. ప్రసిద్ధ్ కృష్ణ 25 వికెట్లతో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు.

**విరాట్‌కు కష్టమే.. సూర్యకే ఛాన్స్**

అత్యధిక పరుగుల జాబితాలో సాయి సుదర్శన్ టాప్‌లో ఉండగా... ఆ తర్వాత ముంబయి ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ (673), శుభ్‌మన్ గిల్ (650), మిచెల్ మార్ష్ (627), విరాట్ కోహ్లీ (614) టాప్ -5లో ఉన్నారు. ఇందులో జీటీ కెప్టెన్ గిల్, లఖ్‌నవూ ఆటగాడు మిచెల్ మార్ష్ రేసు నుంచి వైదొలగారు. సాయికి సూర్యకు మధ్య 86 పరుగుల వ్యత్యాసం మాత్రమే ఉంది. ముంబయి జట్టు రెండో క్వాలిఫయర్‌కు దూసుకెళ్లింది. ఇక్కడా గెలిస్తే ఫైనల్ ఆడే అవకాశం ఉంది. అంటే రెండు మ్యాచుల్లో బ్యాటింగ్ చేసే అవకాశం సూర్యకు ఉంటుంది. అప్పుడు సాయి సుదర్శన్ చేసిన 759 పరుగులను అధిగమించేందుకు ఛాన్స్ లేకపోలేదు. ఇప్పటికే ఆర్సీబీ ఫైనల్‌కు దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఆ జట్టు స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ టాప్ స్కోరర్‌గా మారాలంటే మాత్రం భారీ శతకం చేయాల్సిందే. ఎందుకంటే సాయి కంటే విరాట్ 145 పరుగులు వెనుకబడి ఉన్నాడు. సూర్య, విరాట్ సాధించలేకపోతే మాత్రం సాయి సుదర్శన్‌దే 'ఆరెంజ్ క్యాప్'.

**పర్పుల్ క్యాప్.. నలుగురు పోటీ**

గుజరాత్ ఆటగాడు ప్రసిద్ధ్ కృష్ణ 15 మ్యాచుల్లో 25 వికెట్లు తీశాడు. గుజరాత్ ఎలిమినేట్ అయిపోయింది. ప్రసిద్ధ్ తర్వాత నూర్ అహ్మద్ (24) ఉన్నాడు. అతడు చెన్నై సూపర్ కింగ్స్ ప్లేయర్. ఈ జట్టు లీగ్ స్టేజ్‌కే పరిమితమైన సంగతి తెలిసిందే. వీరి తర్వాత జోష్ హేజిల్ వుడ్ (21), ట్రెంట్ బౌల్ట్ (21), సాయి కిశోర్ (19), జస్‌ప్రీత్ బుమ్రా (18), అర్ష్‌దీప్ (18) ఉన్నారు. సాయి కిశోర్ గుజరాత్ బౌలర్ కావడంతో అతడికి అవకాశాలు లేవు. ఆర్సీబీ ఫైనల్ ఆడాల్సి ఉంది. జోష్ హేజిల్‌వుడ్ మరో నాలుగు వికెట్లు తీస్తే ముందుకు దూసుకెళ్తాడు. పంజాబ్‌తో రెండో క్వాలిఫయర్ ఆడనున్న ముంబయి అందులో గెలిస్తే మాత్రం మరొక మ్యాచ్ ఆడే అవకాశం ఉంటుంది. అంటే ట్రెంట్ బౌల్ట్, బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌కు కాస్త ఎక్కువ ఛాన్స్ ఉన్నట్లే.

## గంభీర్ సెలక్ట్ చేయడు.. రిజెక్ట్ మాత్రమే చేస్తాడు

### - అతుల్ వాసన్



**ఇంటర్నెట్ డెస్క్:** టీమ్ఇండియా జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఇందులోభాగంగా అయిదు టెస్టుమ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈనేపథ్యంలో ఇటీవలే ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్న భారత జట్టును బీసీసీఐ సెలక్టర్లు ప్రకటించారు. ఇందులో శ్రేయస్ అయ్యర్‌కు స్థానం దక్కలేదు. నిజానికి అతడు మంచి ఫామ్‌లో ఉన్నాడు. ప్రస్తుత ఐపీఎల్‌లోనూ చక్కగా రాణిస్తున్నాడు. అయినా జట్టులో చోటు దొరకలేదు. ఇదే విషయమై విలేకర్లు ప్రశ్నిస్తే బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ అసలు కారణం ఏంటో వివరించే ప్రయత్నం చేశాడు. కానీ టీమ్ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం 'నేను సెలక్టర్‌ను కాదు..' అని జవాబిచ్చాడు.

టీమ్ఇండియా మాజీ పేసర్ అతుల్ వాసన్ ఒక ఓటీటీ షోలో ఈ అంశం మీద మాట్లాడుతూ 'గంభీర్ సెలక్ట్ చేయడు.. కేవలం రిజెక్ట్ మాత్రమే చేస్తాడు' అంటూ చురకలంటించాడు. భారత జట్టు ఎంపికలో కోచ్‌కు కూడా కీలక పాత్ర ఉంటుందని వివరించాడు. శ్రేయస్ అయ్యర్‌ను టీమ్‌లోకి ఎందుకు తీసుకోలేదో అతడు వివరంగా చెప్పి ఉండాల్సిందని ఈసందర్భంగా అతుల్ వాసన్ అన్నాడు. శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేయకపోవడంపై పలువురు క్రీడాభిమానులు, విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. మంచి ఫామ్‌లో ఉన్న అతడికి జట్టులో చోటు కల్పించకపోవడం సరైన నిర్ణయం కాదంటున్నారు.

## గుజరాత్ గుండె పగిలింది



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్ 2025లో భాగంగా గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్ మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరిగింది. ఈ పోరులో మొదట బ్యాటింగ్ చేసిన ముంబయి 20 ఓవర్లకు 5 వికెట్లు నష్టపోయి 228 పరుగులు సాధించింది. ఛేదనలో గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 208 రన్స్ చేయగలిగింది. ఇలా కీలకమైన పోరులో 20 పరుగుల తేడాతో ఓటమి పాలై, ఇంటిముఖం పట్టింది. గుజరాత్ ఓటమిని జీర్ణించుకోలేకపోయిన అభిమానులు, ఆ జట్టు ఆటగాళ్ల కుటుంబసభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. మ్యాచ్ అనంతరం గుజరాత్ టైటాన్స్ కోచ్ అశిష్ నెహ్రా కుమారుడు స్టాండ్స్‌లో ఏడుస్తూ కనిపించాడు. అలాగే శుభ్‌మన్ గిల్ సోదరి కూడా కన్నీరు కార్చారు.

ఈ మ్యాచ్‌లో మూడు క్యాచ్‌లను గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు జారవిడిచారు. ఇవే వారిని విజయానికి దూరం చేశాయి. మూడు పరుగుల వద్ద రోహిత్ శర్మ ఇచ్చిన క్యాచ్‌ను గెరాల్డ్ కొయెట్జీ జారవిడిచాడు. తర్వాత 12 పరుగుల వద్ద హిట్‌మ్యాన్ ఇచ్చిన క్యాచ్‌ను కుశాల్ మెండిస్ కూడా ఒడిసి పట్టుకోలేకపోయాడు. ఈ తప్పిదాలు మ్యాచ్‌ను మలుపు తిప్పాయి. తనకు వచ్చిన లైఫ్‌లను సద్వినియోగం చేసుకున్న రోహిత్ 4 సిక్స్‌లు, 9 ఫోర్ల సాయంతో ఏకంగా 81 పరుగులు చేశాడు. సూర్యకుమార్ యాదవ్ ఇచ్చిన క్యాచ్‌ను కూడా మెండిస్ వదిలేశాడు. దీని తర్వాత మరో ఎనిమిది పరుగులు మాత్రమే జోడించి స్కై (33) పెవిలియన్ బాట పట్టాడు. చివర్లో హార్దిక్ పాండ్య విరుచుకుపడటంతో ముంబయి 228 పరుగులు చేయగలిగింది.

'ఇది నిజంగా అద్భుతమైన మ్యాచ్. నిజానికి మేం చక్కగానే ఆడాం. కానీ చివరి మూడు, నాలుగు ఓవర్లు మాకు మ్యాచ్‌ను దూరం చేశాయి. మూడు తేలికైన క్యాచ్‌లను వదిలేసి, మ్యాచ్ గెలవాలంటే అసాధ్యం. అలాంటి పరిస్థితుల్లో బ్యాటర్లను నియంత్రించడం బౌలర్లకు అంత తేలిక కాదు. మేం వారిని 210 పరుగులకు కట్టడి చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. చివరి ఓవర్లోనూ మేం ఒకటి, రెండు సిక్స్‌లు తక్కువ ఇచ్చి ఉంటే బాగుండేది' అని మ్యాచ్ అనంతరం గుజరాత్ టైటాన్స్ సారథి శుభ్‌మన్‌గిల్ అన్నాడు.

## ఆ భారాన్ని మాత్రం మోయకండి: రష్మిక



**ఇంటర్నెట్ డెస్క్:** జీవితంలో ఏదీ శాశ్వతం కాదని అర్థం చేసుకుంటే ఒత్తిడి ఉండదన్నారు నటి రష్మిక ఆమె నటించిన ఛావా మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత విడుదలైన 'సికందర్' మాత్రం ఆశించిన స్థాయిలో అలరించలేకపోయింది. తాజాగా ఈ విషయంపై రష్మిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తన కెరీర్, ఒత్తిళ్ల గురించి ప్రస్తావించారు.

"జీవితంలో ఏదీ శాశ్వతం కాదనే విషయం నాకు తెలుసు. గతంలోనూ నేను ఇదే అంశం గురించి పలుమార్లు మాట్లాడాను. ఒకరోజు మనకు అనుకూలంగా అనిపిస్తుంటుంది. మరుసటి రోజు అంతా మారిపోతుంది. నేను ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా నా కుటుంబం, స్నేహితుల నుంచి మద్దతు ఉండడం నా అదృష్టం. ఒడుదొడుకులను ఎదుర్కోవడంలో ఎప్పుడూ అండగా ఉంటారు. నిజం చెప్పాలంటే నటిని అవుతానని ఎప్పుడూ అనుకోలేదు. ఈ రంగంలోకి రావడానికి ప్రణాళికలు వేసుకోలేదు. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే నేను ఎంత అదృష్టవంతురాలినో అర్థమవుతుంది" అని చెప్పారు.

"కెరీర్ విషయంలో నేను ఎప్పుడూ స్థిరంగా ఉంటాను. అందరికీ ఇచ్చే సలహా కూడా ఇదే. మనసుకు నచ్చిన పని చేయాలి. కూర్గ్ లాంటి చిన్న పట్టణంలో పుట్టిన నేను.. నేడు ఈ స్థాయిలో ఉన్నానంటే అదే కారణం. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకుసాగాలి. ఈ ప్రయాణంలో కఠినమైన పాఠాలు ఉండవు.. అన్నీ విలువైనవే ఉంటాయి. ఎల్లప్పుడూ ఉత్తమంగా ఉండడానికి ప్రయత్నించండి కానీ.. ఇతరులను సంతోషపెట్టాలనే భారాన్ని మాత్రం మోయకండి. మీ ఆనందంపై దృష్టిపెట్టండి" అని రష్మిక సలహా ఇచ్చారు.

## పాక్‌కు సబ్‌మెరైన్లు, యుద్ధనౌకల సమాచారం -గూఢచర్యం కేసులో ఇంజినీర్ అరెస్టు



ఇంటర్నెట్‌డెస్క్: పాకిస్థాన్ తరఫున గూఢచర్యం చేస్తూ.. భారత్‌కు సంబంధించిన రహస్య సమాచారాన్ని శత్రువులకు చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై మహారాష్ట్రలో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అమ్మాయి వలపు వల లో చిక్కిన అతడు.. మన యుద్ధనౌకలు, సబ్‌మెరైన్లకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని అందించినట్లు విచారణలో వెల్లడైంది.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. థానేలోని కల్యానికి చెందిన రవీంద్ర వర్మ(27) మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. 2024లో పాయల్ శర్మ, ఇస్ప్రీత్ అనే పాకిస్థాన్ ఏజెంట్‌లతో ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. ఆ ఏజెంట్లు తమని తాము భారత్‌కు చెందినవారిగా పరిచయం చేసుకున్నారు. ఓ ప్రాజెక్టు విషయంలో యుద్ధనౌకల సమాచారం కావాలని వర్మను కోరారు. అలా కొన్ని రోజులు వారి మధ్య సంభాషణలు సాగాయి. అలా భారత్‌కు చెందిన యుద్ధనౌకల నుంచి, సబ్‌మెరైన్లకు సంబంధించిన సమాచారాన్ని వర్మ వారికి చేరవేశాడు. నిందితుడు ఉద్దేశపూర్వకంగానే, పాక్ ఏజెంట్‌లని తెలిసే ఆయా వివరాలను పంచుకున్నాడు. దీనికి బదులుగా అతడి బ్యాంకు ఖాతాలోకి పెద్ద మొత్తంలో డబ్బు జమయ్యింది.

వర్మ ఒక రక్షణ సాంకేతిక సంస్థలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. దీంతో అతడికి దక్షిణ ముంబయిలోని నావల్ డాక్‌యార్డ్‌కు వెళ్లేందుకు అవకాశం ఉంది. అంతేకాక.. అతడు నావల్ షిప్‌లు, సబ్‌మెరైన్లలో కూడా ప్రయాణించవచ్చు. అయితే, నావల్ డాక్‌యార్డ్‌లోకి ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతి ఉండదు. దీంతో అతడు అక్కడి విషయాలను స్కెచ్‌ల రూపంలో పంచుకునేవాడు. మరికొన్నిసార్లు ఆడియో నోట్స్‌ను వినియోగించాడు.

నిందితుడు ఆ సబ్‌మెరైన్, యుద్ధనౌకల పేర్లను కూడా పాకిస్థాన్ ఏజెంట్‌లతో పంచుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వర్మను కోర్టులో హాజరుపరచగా.. యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ కస్టడీకి అప్పగించింది. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## నేత్రపర్వంగా సహస్రనామార్చన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** శ్రీ శ్రీ శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి సహస్రనామార్చన నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపం లో అధిష్టింపజేశారు. సహస్రనామార్చనలో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. తదుపరి స్వామివారి అంతరాలయ దర్శనమునకు అనుమతించారు.

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సినీనటుడు నాగార్జున

### అఖిల్ వివాహానికి ఆహ్వానం



ఇంటర్నెట్ డెస్క్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని అగ్ర కథానాయకుడు నాగార్జున కలిశారు. సీఎం నివాసంలో ఆయన్ను కలిసి త్వరలో జరగనున్న తన చిన్న కుమారుడు అఖిల్ వివాహ వేడుకకు ఆహ్వానించారు. అలాగే ఆయనతో కాసేపు చర్చించారు. గతేడాది నవంబర్‌లో అక్కినేని అఖిల్ నిశ్చితార్థం జైనబ్ రవ్జీతో జరిగిన విషయం తెలిసిందే. అప్పటినుంచి వీరి పెళ్లి కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. అధికారికంగా వివాహ తేదీ వెల్లడించనప్పటికీ.. జూన్ 6న ఈ వేడుక జరగనున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి.

## బీచ్‌క్లీనింగ్ కార్యక్రమం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ప్లాస్టిక్స్ ఫర్ చేంజ్ మరియు గార్నియర్ ఇండియా వారి ఆధ్వర్యంలో రామకృష్ణ బీచ్ మరియు వై.ఎమ్.సి.ఏ. బీచ్ లో బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యం గా సముద్ర తీరంలో ఉండే వ్యర్థాలను సేకరించారు. ఈ సేకరించిన వాటిలో పేట్ బాటిల్స్ 60 కేజీలు , ప్లాస్టిక్ 300 కేజీలు, గాజు సీసాలు 230 కేజీలు, కొబ్బరి బొండాలు 120 కేజీలు, ధర్మకోల్ 80 కేజీలు, చెప్పులు 60 కేజీలు, కర్రలు 400 కేజీ., చిన్న చిన్న ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా సేకరించారు.

ఈ లాంటి బ్లీచ్ క్లీనింగ్ ఎన్ని చేసినప్పటికీ ప్రజల్లో అవగాహన చాలా రావలసి ఉందని అందరూ అభిప్రాయాలను తెలిపారు.

ప్రతి సంవత్సరం ప్లాస్టిక్స్ ఫర్ చేంజ్ ఆధ్వర్యంలో జరిగే ఇలాంటి కార్యక్రమాలు ప్రజలలో అవగాహన కల్పించడానికి ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్లాస్టిక్స్ ఫర్ చేంజ్ ప్రతినిధి సత్యవేణి, ఎన్జీవో ప్రతినిధులు, క్రిష్టియన్ ఫోరం నుండి పాస్టర్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా బృందం చాలా ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో 313 మెంబెర్స్ పాల్గొన్నారు.

## సీజీఆర్‌ఎఫ్ ఛైర్మన్‌గా బి.సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఎలక్ట్రిసిటీ కన్స్యూమర్ గ్రీవన్స్ రెడ్రసల్ ఫోరం (సీ.జీ.ఆర్.ఎఫ్) ఛైర్మన్‌గా రెండవ పర్యాయం బి.సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ పృధ్వీతేజ్ ఇమ్మాది ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. 2022 నుంచి 2025 వరకు కూడా సత్యనారాయణ సీజీఆర్‌ఎఫ్ ఛైర్మన్‌గా సేవలందించారు. కాగా రాష్ట్రంలోని వివిధ న్యాయస్థానాల్లో 1998 నుంచి 2022 వరకు 24 సంవత్సరాలు పాటు జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా జడ్జి హొదాల్లో న్యాయమూర్తిగా పనిచేశారు. ఆఖరిగా 2022లో జిల్లా జడ్జిగా పదవీ విరమణ చేశారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గత మూడేళ్లూ ఆయన నిబద్ధతతో తీర్పులు ఇచ్చారు. కాగా సత్యనారాయణ పునర్నియామకం పట్ల రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాండ్రేగుల వెంకటరమణ, ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.హరిబాబు (ఫైనాన్స్), సీజీఆర్‌ఎఫ్ సభ్యులు ఎన్.మురళీకృష్ణ (ఇండిపెంట్), ఎస్.సుబ్బారావు (ఫైనాన్స్), బి.సులేఖరాణి (టెక్నికల్) హర్షం ప్రకటించారు.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com